CELEBRATING 11TH YEAR ANNIVERSARY
ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 9 సంచిక : 51 పేజీలు :12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 28 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :9 ISSUE : 51 PAGES :12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 28 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## విశాఖలో భారీ వర్షం.. చెరువులను తలపిస్తున్న రోడ్లు

మొంథా తుపాను ప్రభావంతో విశాఖ నగరంలో భారీ వర్షం కురుస్తోంది. పలు చోట్ల ఈదురుగాలులు వీస్తున్నాయి. కైలాసపురంలో గాలుల ప్రభావానికి చెట్లు విరిగిపడ్డాయి. పలు చోట్ల రోడ్డుపైకి వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చెట్లు, విద్యుత్ స్తంభాల కింద ఉండొద్దని జీవీఎంసీ అధికారులు ప్రజలను సూచించారు.



# మొంథా తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష..

## ప్రధాని మోదీ ఫోన్, యంత్రాంగానికి కీలక ఆదేశాలు

- మొంథా తుపానుపై సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష
- సీఎంకు ఫోన్ చేసి వివరాలు అడిగిన ప్రధాని మోదీ
- కాకినాడకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన తుపాను
- రాత్రికి తీరం దాటే అవకాశం ఉందని అంచనా
- కృష్ణా జిల్లాకు అతి భారీ వర్ష సూచన
- పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:మొంథా తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా చంద్రబాబుకు ఫోన్ చేసి తుపాను పరిస్థితిపై ఆరా తీశారు.ప్రస్తుతం మొంథా తుపాను కాకినాడకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అధికారులు సీఎంకు వివరించారు. గంటకు 16 కిలోమీటర్ల వేగంతో ఇది తీరం వైపు కదులుతోందని, రేపు రాత్రికి తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. తుపాను ప్రభావంతో ఈరోజు, రేపు కృష్ణా జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతీ గంటకు తుపాను కదలికలను గమనిస్తూ, వర్షాలు, వరదలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పంట నష్టం జరగకుండా

వివరాలు 2లో..

## ఏపీలో ఇప్పుడు హై అలర్ట్... కలసికట్టుగా ఎదుర్కొందాం



- మొంథా తుఫానుపై అప్రమత్తమైన ఏపీ ప్రభుత్వం
- జీరో క్యాజువాలిటీ లక్ష్యంతో సహాయక చర్యలు ముమ్మరం
- 19 జిల్లాల్లో 40 లక్షల మందిపై ప్రభావం అంచనా
- సురక్షిత ప్రాంతాలకు వేలాది మంది ప్రజల తరలింపు
- రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు
- అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రజలకు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి

పెన్ పవర్ డెస్క్:మొంథా తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా "జీరో క్యాజువాలిటీ" లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు ఐటీ, మానవ వనరులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రజల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అని, ప్రభుత్వ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని

వివరాలు 2లో..

## తుపాను సందట్లో దొంగల బెడద లేకుండా చూడాలి



- మొంథా తుపానుపై కాకినాడ జిల్లా అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష
- తీరం దాటనున్న నేపథ్యంలో 12 మండలాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం
- ప్రాణ నష్టం నివారణే లక్ష్యంగా ముందస్తు చర్యలు చేపట్టాలని కీలక ఆదేశాలు
- గర్భిణులు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టమైన సూచనలు
- పునరావాస కేంద్రాల్లో ఆహారం, మందులు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం
- తుపాను సహాయక చర్యల కోసం కాకినాడకు రూ. కోటి అత్యవసర నిధి విడుదల

వివరాలు 2లో..

రష్యా నుంచి చమురు కొనుగోలు..

## ట్రంప్ ప్రభుత్వంపై జైశంకర్ ఆగ్రహం



- ఇంధన కొనుగోళ్ల విషయంలో ఒక్కోదేశం పట్ల అమెరికా ఒక్కో విధంగా వ్యవహరిస్తోందని విమర్శ
- నీతులు చెప్పేవారు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శ
- ఆసియాన్ సదస్సులో జైశంకర్ వ్యాఖ్యలు

వివరాలు 2లో..

## 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్..




- 'ఎస్ఐఆర్'పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన
- బీహార్‌లో ఎస్ఐఆర్ విజయవంతమైందన్న ప్రధాన ఎన్నికల కమిషనర్
- రెండో దశలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తామని వెల్లడి
- 21 ఏళ్ల కింద ఓటర్ల జాబితా సవరణ జరిగిందన్న జ్ఞానేశ్ కుమార్

పెన్ పవర్ డెస్క్:ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర సవరణ)పై కేంద్ర ఎన్ని కల సంఘం సోమవారం కీలక ప్రకటన చేసింది. బీహార్‌లో

వివరాలు 2లో..

తుపానుపై సంచలన థంబ్ నెయిల్స్, హెడ్డింగ్‌లతో

## భయభ్రాంతులకు గురిచేయొద్దు



- మొంథా తుపాను నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సన్నద్ధం
- తుపాను వార్తలపై సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంయమనం పాటించాలన్న అనిత
- తప్పుడు థంబ్‌నెయిల్స్‌తో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దని స్పష్టం
- సంచలన హెడ్డింగులతో గందరగోళం సృష్టించడం చట్టవిరుద్ధమని వెల్లడి

వివరాలు 2లో..

విజయవాడ కనకదుర్గమ్మ సాక్షిగా సత్యప్రమాణం

## చేసిన జోగి రమేశ్.. చంద్రబాబు, లోకేశ్‌కు సవాల్



- నకిలీ మద్యం కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని జోగి రమేశ్ స్పష్టీకరణ
- కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చిన మాజీ మంత్రి
- లైడిటెక్టర్, నార్కో అనాలసిస్ టెస్టులకు తాను సిద్ధమని ప్రకటన
- తన వ్యక్తిత్వాన్ని హననం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- తనపై తప్పుడు ఆరోపణలు చేసిన వారు సత్యప్రమాణానికి సిద్ధమా? అని సవాల్

వివరాలు 2లో..

'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్...

## అన్ని రాష్ట్రాలకు నోటీసులు



- 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ
- అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ
- మోసాలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు సమర్పించాలని ఆదేశం
- ఇది దేశవ్యాప్త కుంభకోణం.. దర్యాప్తు సీబీఐకి అప్పగించేందుకు మొగ్గు
- ఈ మోసాల వెనుక మయన్మార్, థాయ్‌లాండ్ ముఠాలు ఉన్నాయని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసా లపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పోలీసులు, న్యాయాధికారులమంటూ నకిలీ కోర్టు పత్రాలతో పౌరులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మోసాలపై దాఖలైన కేసును సుమోటోగా విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం, సోమవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది.జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది.

వివరాలు 2లో..

ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...

## వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఫైర్

- వీధి కుక్కల నియంత్రణపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- ఆదేశాలు పాటించని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు సమన్లు
- పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలకు మినహాయింపు
- నవంబర్ 3న కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం
- దేశ ప్రతిష్ట దెబ్బతింటోందని ధర్మాసనం కీలక వ్యాఖ్య
- హాజరు కాకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము జారీ చేసిన ఆదేశాలను పాటిం చడంలో విఫలమైనందుకు పశ్చిమ బెంగాల్, తెలంగా ణ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు (ప్రధాన కార్యదర్శులు) సమన్లు జారీ చేసింది. వారంతా నవంబర్ 3న తమ ఎదుట వ్యక్తిగతంగా

వివరాలు 2లో..



## ఏపీలో రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- ఏపీ రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రాష్ట్రవ్యాప్తంగా రూ.33,630 కోట్ల విలువైన పనులు
- నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్ పనుల పురోగతిపై చర్చ
- అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి, కొత్త లైన్ల ప్రతిపాదనల ప్రస్తావన
- సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి, రైల్వే ఉన్నతాధికారులు

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబా బు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం రూ.33,630 కోట్ల విలువైన రైల్వే పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు

వివరాలు 2లో..

## గెలిస్తే అనుమానం వస్తుందని బీహార్‌లో బీజేపీ గెలవదు



- బీజేపీ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీని గెలిపిస్తుందన్న పాల్
- ఈవీఎం ఉన్నంత వరకు బీజేపీయే అధికారంలో ఉంటుందని వ్యాఖ్య
- బ్యాలెట్ వధానం కోసం తాము పోరాడుతున్నామన్న కేఏ పాల్

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# దటీజ్ చంద్రబాబు 70ఏళ్ల వయస్సులో చాలెంజ్

10 సంవత్సరాల వయసులో ఉన్న ఉత్సాహం 20 సంవత్సరాల వయసులో ఉండదు. ఇలా వయసు మారుతున్న కొద్దీ మనుషులలో మార్పులు వస్తుంటాయి. ఇది సహజంగా జరిగే ప్రక్రియే. కానీ కొంతమంది వయసు వెనక్కి పంపించేస్తుంటారు. తమ ఉత్సాహం ముందు.. తమ క్రమశిక్షణమందు వయసును చిన్నబోయేలా చేస్తారు. అటువంటి వారిలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకరు. వాస్తవానికి ఈ జాబితాలో చంద్రబాబు నాయుడు కు మొదటి స్థానం ఇవ్వాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడుల కోసం నాడు చంద్రబాబు నాయుడు అనేక దేశాలు తిరిగారు. మైక్రోసాఫ్ట్ అనే సంస్థను హైదరాబాద్ తీసుకొచ్చారు. మైక్రోసాఫ్ట్ ద్వారా ఐటీకి ఒక ఎకో సిస్టం డెవలప్ చేశారు. ఈరోజు హైదరాబాద్ ఐటి విభాగంలో ఈ స్థాయిలో అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం చంద్రబాబు నాయుడు అనడంలో ఎటువంటి అనుమానం అక్కర్లేదు. ఈ విషయాన్ని అనేకమంది ముఖ్యమంత్రులు.. అనేకమంది నాయకులు ఒప్పుకున్నారు. చంద్రబాబు నాయుడు మొదటినుంచి కూడా ఆహారం తీసుకునే విషయంలో కట్టుదిట్టంగా ఉంటారు. ఏమాత్రం దానిని బ్రేక్ చేయరు. ఆయనకు ఎంతో కాలం నుంచి మధుమేహం ఉంది. అయినప్పటికీ అయినప్పటికీ దానిని నియంత్రణలో ఉంచుకుంటున్నారు. చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లో కూడా అన్నం తినరు. కేవలం తృణధాన్యాలను మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. కాఫీ తాగుతారు. గ్రిల్డ్ ఫిష్ తీసుకుంటారు. నాన్ వెజ్ విషయంలో ఆయనకు చాలా లెక్కలు ఉంటాయి. ప్రతిరోజు ఉదయం వ్యాయామం చేస్తారు. యోగా చేస్తారు. మెడిటేషన్ కూడా చేస్తారు. అందువల్ల చంద్రబాబు ఏడుపదుల వయసు దాటినప్పటికీ కూడా ఉత్సాహంగా కనిపిస్తుంటారు. ప్రతి విషయాన్ని కూడా గుర్తుంచుకుంటారు. ఆ విషయాన్ని చెప్పడానికి ఏమాత్రం సంకోసించరు. చంద్రబాబు ప్రస్తుతం విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. అమరావతి ప్రాంతంలో రాజధాని నిర్మించడానికి వేగంగా అడుగులు వేస్తున్నారు. కేంద్రంలో అనుకూలమైన ప్రభుత్వం ఉన్నప్పటికీ చంద్రబాబు స్వీయ శక్తిని నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. ఈ వయసులో కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రాంతంలో అనేక దేశాలను తిరిగివచ్చారు. అమరావతి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పెట్టుబడుల సదస్సుకు రావాలని అక్కడి కంపెనీల అధిపతులను కోరారు. అక్కడి ప్రభుత్వ అధినేతలను విన్నవించారు. అమరావతిలో భారీగా విదేశీ సంస్థలను తమ కార్యకలాపాలు ప్రారంభించే దిశగా చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకరకంగా ఇది సానుకూల అంశం. ఏపీ రాష్ట్రానికి మరింత సానుకూల అంశం. రాజకీయాల విషయాలను పక్కన పెడితే చంద్రబాబు ఈ వయసులో కూడా అక్కడికి వెళ్లడం ఒకరకంగా అద్భుతం అని చెప్పాలి. ప్రత్యేకమైన విమానాలు ఉన్నప్పటికీ.. అనేక రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ ఈ వయసులో ఆయన అక్కడికి వెళ్లడం మిరాకిల్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. కొన్ని రాష్ట్రాలలో చంద్రబాబు కంటే తక్కువ వయసు ఉన్నవారు.. చంద్రబాబుతో సమానంగా వయసు ఉన్నవారు.. చంద్రబాబు కంటే ఎక్కువ వయసు ఉన్నవారు ముఖ్యమంత్రులుగా పనిచేస్తున్నారు. కానీ చంద్రబాబు మాదిరిగా ఎవరూ పెట్టుబడుల కోసం ఇతర దేశాలకు వెళ్లడం లేదు. ఇతర దేశాల కంపెనీల ప్రతినిధులను ఒప్పించడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధి విషయంలో అహర్నిశలు శ్రమించడం లేదు. సాధారణంగా ఒక వయసుకు వచ్చిన తర్వాత చాలామంది ఉత్సాహంగా పనిచేయలేరు. ముఖ్యంగా 70 సంవత్సరాల వయసు దాటిన తర్వాత చాలామంది రిలాక్స్ అవ్వాలని కోరుకుంటారు. వయసు వల్ల వచ్చిన నీరసం కూడా ఇబ్బంది పెడుతూ ఉంటుంది. కానీ చంద్రబాబుకు అలసట అనేది తెలియడం లేదు. నీరసమనేది దరిచేరడం లేదు. ఈ వయసులో కూడా ఆయన ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారు. తన కలల రాజధాని కోసం విపరీతంగా శ్రమిస్తున్నారు. కేంద్రం నుంచి మొదలుపెడితే విదేశాల వరకు ఆయన అన్ని తలుపులను కూడా తడుతున్నారు. ఉజ్వలమైన ఏపీ కోసం బలమైన అడుగులు వేస్తున్నారు. ఒక నాయకుడు అనే వాడు బలమైన సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. దృఢమైన ఆలోచనలను అమలు చేయాలి. అప్పుడే ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుంది. ఇప్పుడు చంద్రబాబు చేస్తోంది కూడా అదే.

## ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?... వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఫైర్

- మొదటి పేజి తరువాయి

హాజరు కావాలని సోమవారం ఆదేశం చింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) రూల్స్, 2023 అమలుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ ఏడాది ఆగస్టులోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, చాలా రాష్ట్రాలు పట్టించుకోకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "అధికారులు వార్తాపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియా చూడటం లేదా? ఆదేశాలు అందకపోయినా, అఫిడవిట్లు ఇక్కడ ఉండాల్సింది. నవంబర్ 3న చీఫ్ సెక్రటరీలందరూ తప్పనిసరిగా కోర్టులో హాజరు కావాలి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది. పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయని కోర్టు గుర్తించింది. "దేశంలో వీధి కుక్కలకు సంబంధించిన ఘటనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల విదేశాల దృష్టిలో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మేం కూడా వార్తా కథనాలను చదువుతున్నాం" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో, ఈ కేసులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరుతూ వివిధ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు (%=ఔూ%), వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లపై కూడా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. "దేశంలోని %=ఔూ%లన్నీ ఈ కేసులో పార్టీలుగా చేరతామంటే, మన ముందు కోట్లాది మంది ఉంటారు కదా? సహేతుకమైన సూచనలు చేయండి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ తేదీన చీఫ్ సెక్రటరీలు హాజరు కాకపోతే, కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఢిల్లీ విషయంలో ఎంసీడీ ఇచ్చిన నివేదిక సరిపోదని, అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదో ఢిల్లీ చీఫ్ సెక్రటరీ వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కాగా, ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల ప్రకారం, కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలతో పాటు, వాటి కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ల వివరాలతో అన్ని రాష్ట్రాలు నివేదికలు సమర్పించాల్సి ఉంది. ఈ కేసు తదుపరి విచారణ నవంబర్ 3న జరగనుంది.

# తుపానుపై సంచలన థంబ్ నెయిల్స్, హెడ్డింగ్‌లతో భయభ్రాంతులకు గురిచేయొద్దు

ఏపీకి మొంథా తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని, సహాయక చర్యలకు సర్వసన్నద్ధంగా ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత మీడియాపై ఉందని, ముఖ్యంగా సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంస్థలు సంయమనం పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సంచలనాల కోసం తప్పుడు థంబ్‌నెయిల్స్, హెడ్డింగులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె హితవు పలికారు.

**ప్రభుత్వం పూర్తి సన్నద్ధం**

తుపాను హెచ్చరికలు వెలువడిన నాటి నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైందని మంత్రి అనిత తెలిపారు. గత మూడు రోజులుగా సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ తో కలిసి తాను కూడా ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని, అన్ని విభాగాలను అప్రమత్తం చేశామని వివరించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో పాటు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా పటిష్టమైన ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించేందుకు జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించామని, సహాయక చర్యలకు అవసరమైన నిధులను కూడా విడుదల చేశామని పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, మీడియా ద్వారా వాస్తవ పరిస్థితులను వివరిస్తున్నామని తెలిపారు.

**సోషల్ మీడియా బాధ్యతగా వ్యవహరించాలి**

విపత్కర సమయాల్లో సమాచారాన్ని వేగంగా చేరవేసే సోషల్ మీడియా, డిజిటల్ మీడియా వేదికలు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని మంత్రి అనిత నొక్కిచెప్పారు. అయితే, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు, డిజిటల్ మీడియా సంస్థలు కేవలం వ్యూస్ కోసం ప్రజలను భయపెట్టేలా థంబ్‌నెయిల్స్, సంచలన హెడ్డింగులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఆర్టీజీఎస్ సెంటర్ ద్వారా ఈ విషయం తమ పరిశీలనలోకి వచ్చిందని, ఇలాంటి తప్పుడు ప్రచారాల వల్ల ప్రజల్లో తీవ్ర గందరగోళం, అలజడి నెలకొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "సంచలనాల కోసం, వ్యూస్ కోసం ప్రజలను భయపెట్టేలా వ్యవహరించడం చట్టవిరుద్ధం. అభూత కల్పనలు, అవాస్తవాలతో కూడిన సమాచారం తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలను, వారి కుటుంబ సభ్యులను మానసికంగా కుంగదీస్తుంది. దీన్ని నివారించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని అనిత స్పష్టం చేశారు. వార్తల కవరేజీలో వాస్తవాలకు అద్దం పట్టేలా వ్యవహరించాలని, ప్రభుత్వ అధికారిక సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని ఆమె సూచించారు. సమాచార వ్యాప్తిలో కీలకపాత్ర పోషించే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా కూడా ఈ విపత్కర సమయంలో ప్రభుత్వానికి, ప్రజలకు అండగా నిలవాలని హోం మంత్రి కోరారు.

# రష్యా నుంచి చమురు కొనుగోలు.. ట్రంప్ ప్రభుత్వంపై జైశంకర్ ఆగ్రహం

రష్యా చమురు విషయంలో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తీవ్రంగా ఖండించారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో అమెరికా ఒక్కో దేశంతో ఒక్కో విధంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. నీతులు బోధించేవారే వాటికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. కౌలాలంపూర్‌లో జరిగిన ఆసియాన్ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ట్రంప్ ప్రభుత్వం 25 శాతం సుంకం విధిస్తున్న విషయం విదితమే. చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని భారత్‌పై ఒత్తిడి తెస్తోంది. అదే సమయంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, యూరప్ దేశాలపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఆసియాన్ సదస్సులో అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియోతో జైశంకర్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# విజయవాడ కనకదుర్గమ్మ సాక్షిగా సత్యప్రమాణం చేసిన జోగి రమేశ్.. చంద్రబాబు, లోకేశ్‌కు సవాల్

నకిలీ మద్యం కేసులో తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో సత్యప్రమాణం చేసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రికి చేరుకున్న ఆయన, ఘాట్ రోడ్డు ప్రవేశద్వారం వద్ద చేతిలో దీపం వెలిగించి, ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జోగి రమేశ్ మాట్లాడుతూ.. "నా వ్యక్తిత్వంపై నింద వేశారు. నా మనసును గాయపరిచారు. అందుకే కుటుంబంతో సహా వచ్చి, ఏ తప్పు చేయలేదని అమ్మవారి ఎదుట నిండు మనసుతో ప్రమాణం చేశాను. నా కుటుంబాన్ని అవమానించిన వారికి అమ్మవారు మంచి బుద్ధి ప్రసాదించాలి" అని అన్నారు. గతంలో తాను చెప్పినట్లే తిరుపతి వెంకన్న, బెజవాడ దుర్గమ్మపై ప్రమాణానికి కట్టుబడి ఉన్నానని, అందులో భాగంగానే ఇప్పుడు ప్రమాణం చేశానని తెలిపారు. నకిలీ మద్యం కేసులో నార్కో అనాలసిస్, లైడిటెక్టర్ టెస్టులకు కూడా తాను సిద్ధంగా ఉన్నానని పునరుద్ఘాటించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. "నాపై తప్పుడు ఆరోపణలు చేసిన వారు సత్యప్రమాణానికి సిద్ధమా? కనీసం లైడిటెక్టర్ టెస్టుకైనా వచ్చే దమ్ముందా? కనకదుర్గమ్మ సాక్షిగా నేను తప్పు చేసినట్లు నిరూపించాలి" అని సవాల్ విసిరారు.

# తుపాను సందట్లో దొంగల బెడద లేకుండా చూడాలి

మొంథా తుపాను కాకినాడ సమీపంలో తీరం దాటనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ప్రాణ నష్టాన్ని నివారించడమే ప్రథమ కర్తవ్యంగా భావించి, ముందస్తు రక్షణ చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం, సహాయక చర్యలపై కాకినాడ జిల్లా ఇంఛార్జి మంత్రి నారాయణ, స్పెషల్ ఆఫీసర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ బిందు మాధవ్, ఇతర ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "మొంథా తుపాను ప్రభావం కాకినాడ జిల్లాలోని 12 మండలాలపై అధికంగా ఉంటుందని సమాచారం. రేపు కాకినాడ పరిసర ప్రాంతాల్లో తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. యంత్రాంగం 24 గంటలూ అందుబాటులో ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. తీర ప్రాంత ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే జిల్లాలో 260 పునరావాస కేంద్రాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు, పాలు, అత్యవసర ఔషధాలు సిద్ధంగా ఉంచాలి" అని దిశానిర్దేశం చేశారు.

ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కళ్యాణ్ సూచించారు. "పిఠాపురం నియోజకవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న గర్భిణులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలి. ఇప్పటికే 142 మంది గర్భిణులను పునరావాస కేంద్రాలకు చేర్చినట్లు కలెక్టర్ తెలిపారు. వారికి అవసరమైన పౌష్టికాహారం, వైద్య సేవలు నిరంతరం అందేలా చూడాలి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలి. తుపానుపై భయాందోళనలు సృష్టించకుండా, గ్రామాల్లో మైకుల ద్వారా సహాయక చర్యలను వివరిస్తూ ప్రజలకు ధైర్యం చెప్పాలి" అని ఆయన అన్నారు.

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

తుపాను సహాయక చర్యల్లో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాలకు తరలివెళ్లిన ప్రజల ఇళ్లకు దొంగల బెడద లేకుండా పోలీసులు ప్రత్యేక భద్రత కల్పించాలని, అవసరమైతే సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున, ఆయకట్టు ప్రజలను జలవనరుల శాఖ అధికారులు ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. బలహీనంగా ఉన్న చెరువు కట్టలు, కాలువ గట్లను గుర్తించి ఇసుక బస్తాలతో పటిష్ఠం చేయాలని సూచించారు.

మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా కట్టడి చేయాలని, వారి బోట్లకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులకు తెలిపారు. తుపాను కారణంగా నిత్యావసర వస్తువుల సరఫరాకు ఆటంకం కలగకుండా మార్కెటింగ్ శాఖ చూడాలన్నారు. విద్యుత్ స్తంభాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉన్నందున, మరమ్మతుల కోసం సిబ్బందిని సిద్ధం చేయాలని, అత్యవసర సమాచారం కోసం శాటిలైట్ ఫోన్లను వినియోగించాలని సూచించారు.

**కాకినాడకు కోటి రూపాయల అత్యవసర నిధి**

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 19 కోట్లు విడుదల చేయగా, అందులో కాకినాడ జిల్లాకు ప్రత్యేకంగా రూ. కోటి కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ నిధులను పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, బాధితులకు నిత్యావసరాల పంపిణీ, దెబ్బతిన్న ఇళ్లకు తక్షణ సాయం అందించడం వంటి కార్యక్రమాలకు వినియోగించాలని అధికారులకు స్పష్టం చేశారు.

# ఏపీలో ఇప్పుడు హై అలర్ట్... కలసికట్టుగా ఎదుర్కొందాం

- మొదటి పేజి తరువాయి

ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు తుపాను సన్నద్ధతపై ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో దాదాపు 40 లక్షల మంది ప్రజలు తుపాను ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. వీరి భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదకర ప్రాంతాల్లోని 1,238 గ్రామాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. బాధితుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,906 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్లు వివరించారు. ముఖ్యంగా 3,465 మంది గర్భిణులు, బాలింతలను గుర్తించి, వారిని సురక్షితంగా ఆసుపత్రులకు తరలించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

ముందస్తు చర్యల్లో భాగంగా 14,798 పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, వాటిలో 364 పాఠశాలలను తుపాను షెల్టర్లుగా మార్చారు. అక్టోబర్ 29 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, బోటింగ్, బీచ్‌లలో పర్యాటకంపై పూర్తి నిషేధం విధించినట్లు లోకేశ్ వెల్లడించారు. సహాయక చర్యల కోసం 11 ఎన్డీఆర్ఎఫ్, 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. అగ్నిమాపక సిబ్బంది, బోట్ బృందాలు, చెట్లను తొలగించే బృందాలను లైఫ్ జాకెట్లు, ఇతర రక్షణ పరికరాలతో సిద్ధం చేశారు. అత్యవసర వైద్య సేవలకు 325 మెడికల్ క్యాంపులు, 876 ఆరోగ్య తక్షణ స్పందన బృందాలు, 108, 104 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. మూడు బోట్ క్లినిక్‌లను కూడా క్రియాశీలకం చేశారు.

తుపాను అనంతరం విద్యుత్ పునరుద్ధరణ కోసం 772 బృందాలను 11,347 స్తంభాలు, 1,210 ట్రాన్స్‌ఫార్మర్లతో సిద్ధంగా ఉంచారు. రహదారులపై అడ్డంకులను తొలగించడానికి 7,289 యంత్రాలు, తాగునీటి సరఫరాకు 1,521 ట్యాంకర్లు, 1,037 జనరేటర్లు ఏర్పాటు చేశారు. కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం కలగకుండా 16 శాటిలైట్ ఫోన్లు, 35 డీఎంఆర్ సెట్లు, 10 మొబైల్ నెట్‌వర్క్ టవర్లను (%జూఔం%) కీలక ప్రాంతాల్లో మోహరించారు. ప్రధానమంత్రి కార్యాలయం, ఆర్మీ, ఎన్డీఎంఏ, పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నట్లు మంత్రి నారా లోకేశ్ వివరించారు. ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దని మంత్రి లోకేశ్ సూచించారు. ప్రభుత్వం జారీ చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు. ఈ విపత్తును అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని ఆయన పిలుపునిచ్చారు.

# గెలిస్తే అనుమానం వస్తుందని బీహార్‌లో బీజేపీ గెలవదు

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలవదని, ఆ పార్టీయే ఆర్జేడీని గెలిపిస్తుం దని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో అసలైన ఓట్లను తొలగించి, లేని ఓట్లను చేర్చారని ఆరోపించారు. దేశంలో ఈవీఎం ద్వారా ఓటింగ్ ఉన్నంత వరకు బీజేపీ అధికారంలో ఉంటుందని ఆయన వ్యాఖ్యా నించారు. బీహార్‌లో బీజేపీ గెలిస్తే దేశ ప్రజలకు అనుమానం వస్తుందనే ఆలోచనతో అక్కడ ఆర్జేడీని గెలిపిస్తారని ఆయన జోస్యం చెప్పారు. ఎన్నికలు బ్యాలెట్ విధానంలోనే జరగాలని ఆయన డిమాండ్ చేశారు. బ్యాలెట్ విధానం కోసం తన పార్టీ పోరాడుతోందని కేఏ పాల్ పేర్కొన్నారు.

# 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్... అన్ని రాష్ట్రాలకు నోటీసులు

- మొదటి పేజి తరువాయి

ఈ తరహా మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) వివరాలు సమర్పించా లని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. "దేశవ్యాప్తంగా ఒకేరీతిలో దర్యాప్తు జరిగేలా చూసేందుకు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తున్నాం" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసాలు కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా, దేశ సరిహద్దులు దాటి కూడా జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ఈ కేసుల దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సూచించింది.

కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఇలాంటి అనేక కేసులను సీబీఐ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక సహకారం అందిస్తోందని కోర్టుకు తెలిపారు. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి మాట్లాడుతూ, ఈ మోసాల వెనుక ఉన్న మనీలాండరింగ్ ముఠాలు భారత్ బయట నుంచి, ముఖ్యంగా మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి పనిచేస్తున్నాయని వివరించారు. విచారణ సందర్భం గా, హర్యానా ప్రభుత్వం స్పందిస్తూ... అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడా నికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలియజేసింది. సంబంధిత ఇతర ఎఫ్ఐఆర్‌ల వివరాలు సమర్పించేందుకు వారం రోజుల సమయం కోరగా, ధర్మాసనం అనుమతించింది. ఈ క్రమంలో, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలో నమోదైన 'డిజిటల్ అరెస్ట్' సంబంధిత ఎఫ్ఐఆర్‌ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతానికి అధికారికంగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాల్సిన అవసరం లేదని, కేవలం కేసుల వివరాలను రికార్డుల రూపంలో అందించాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ నివేదికలు సమర్పించిన తర్వాత ఈ కేసుపై తదుపరి విచారణ జరగనుంది.

# మొంథా తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష..

- మొదటి పేజి తరువాయి

కాలువ గట్లను పటిష్టం చేయాలని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని మంత్రి నారా లోకేశ్‌కు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్..

- మొదటి పేజి తరువాయి

ఎస్ఐఆర్ విజయవంతమైందని, మరో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో దీనిని నిర్వహించబోతున్నామని తెలిపింది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ, రెండో దశ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను త్వరలో చేపట్టనున్నామని వెల్లడించారు.

1951 నుంచి 2004 వరకు ఎనిమిదిసార్లు ఎస్ఐఆర్ నిర్వహించారని అన్నారు. 21 ఏళ్ల కిందట ఓటర్ల జాబితా సవరణ జరిగిందని గుర్తు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా నకిలీ ఓట్లు, అక్రమ వలసదారులు, చనిపోయిన, బదిలీ చేయబడిన ఓటర్లను తొలగించినట్లు వెల్లడించారు. ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సవరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. బీహార్‌లో 7.5 కోట్ల మందితో ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తయిందని అన్నారు. బీహార్‌లో ఈ ప్రక్రియపై ఎవరూ అభ్యంతరాలు చెప్పలేదని తెలియజేశారు. రెండో దశలోనూ ప్రతి ఇంటికి మూడుసార్లు వెళ్లి ఓటరుపై నిర్ధారణ చేసుకుంటామని తెలిపారు. ఎస్ఐఆర్‌పై రాజకీయ అవగాహన కల్పిస్తామని ఆయన అన్నారు. రెండో దశలో ప్రత్యేక సమగ్ర సవరణ జరగనున్న రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు: అండమాన్ నికోబర్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్. రెండో దశ ఎస్ఐఆర్ జరగనున్న రాష్ట్రాల్లో 51 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారని, నవంబర్ 4వ తేదీ నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. అసోంలో ఎన్ఆర్‌సీ ఉన్నందున ఎస్ఐఆర్ లేదని స్పష్టం చేశారు.

# ఏపీలో రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ఈ కీలక ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సమీక్షలో పలు ముఖ్యమైన రైల్వే లైన్ల పనుల పురోగతిపై అధికారులు నివేదిక సమర్పించారు. ముఖ్యంగా నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్ డబ్లింగ్, గుణదల-ముస్తాబాద్ బైపాస్, రాయదుర్గ్-తుముకూరు మధ్య కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులు ఎంతవరకు వచ్చాయో చర్చకు వచ్చింది. వీటితో పాటు, రాష్ట్రంలో కొత్తగా చేపట్టాల్సిన రైల్వే లైన్లు, అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రైల్వే స్టేషన్ల అభివృద్ధి, రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ), అండర్ బ్రిడ్జి (ఆర్ యూబీ)ల నిర్మాణానికి సంబంధించి రైల్వే శాఖకు పంపిన ప్రతిపాదనలపైనా సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ శ్రీవాస్తవ, తూర్పు, దక్షిణ కోస్తా రైల్వేలకు చెందిన పలువురు కీలక అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖ సమన్వయంతో పనిచేయాలని ఈ సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

### ఆవ వాంబే గృహాల్లో

# యేదేచ్ఛగా ఆక్రమ నిర్మాణాలు





**పిల్లర్స్, భీమ్ లపై ప్రమాదకరంగా అదనపు కట్టడాలు**
**వీధి రోడ్లు, డ్రైనేజీల పై ఆక్రమణలతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు**
**చోద్యం చూస్తున్న కార్పొరేషన్ అధికారులు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 27:** కార్పొరేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఉన్న వాంబే గృహాలు ఆక్రమణల బారిన పడి ప్రమాదకరంగా మారాయి. ప్రభుత్వం నిర్దేశించిన హద్దులను , భవన నిర్మాణ ప్రమాణాలను అతిక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం వల్ల సమీప నివాసితులకు సమస్యాత్మకంగా మారాయి. నగరంలో 16వ డివిజన్లో ని తూర్పు రైల్వే స్టేషన్ రోడ్లో ఆవ వాంబే గృహాలను 94 బ్లాకులు నిర్మించగా, ఒకొక్క బ్లాక్ లో24 కుటుంబాల చొప్పున సుమారు 3000 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న గృహ నివాసితులు వీధులను, డ్రైన్ లను ఆక్రమించుకొని అదనపు నిర్మాణాలను చేపట్టడం వల్ల డ్రైనేజీలు మూసుకుని పోయి మురికి నీరు ప్రవాహానికి అడ్డంకి గా మారి వీధులు, పరిసర ప్రాంతాలు మురికి నీరుతో మునిగి పోతున్నాయినీ స్థానికులు, మహిళలు వాపోతున్నారు. మొదటి అంతస్తులో ఉన్నవారు భవన నిర్మాణంలో భాగంగా పునాదిలో వేసిన పిల్లర్స్ ను, బీమ్స్ లపై కూడా అక్రమ నిర్మాణాలు యాదేచ్ఛగా చేపట్టడం వల్ల భవనాల మనుగడకు ప్రమాదకరంగా మారిందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు కాలనీ లోని అన్ని బ్లాక్ ల్లో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుల్లో ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. ఇష్టానుసారంగా ఆక్రమ నిర్మాణాలు చేపట్టడం వల్ల మంచినీటి కుళాయిల పైపులైన్లు, లావెట్రీ పైపులు లీకేజీలకు వచ్చి మిగతా నివాసితులకు ఇబ్బందికరంగా మారిందని విమర్శలు వస్తున్నాయి . ప్రతి బ్లాక్ మధ్య స్థానికులు, నివాసితులు రాకపోకలు సాగించేందుకు వీలుగా చేసిన మార్గాలను కూడా గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్నవాళ్లు ఆక్రమించుకుంటున్నారని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నమని స్థానిక మహిళలు, వృద్ధులు వాపోతున్నారు. ప్రతి బ్లాకు లోని నివాసితులకు సామూహికంగా ఉపయోగపడాల్సిన రాకపోకల మార్గాన్ని అక్రమ నిర్మాణాలతో మూసి వేయడం పట్ల గ్రౌండ్ ఫ్లోర్లో ఉన్న వారితో తరచూ ఘర్షణలు జరుగుతున్నాయని మహిళలు వాపోయారు. గ్రౌండ్ ఫ్లోర్ లో డ్రైనేజీలు కూడా ఆక్రమణ గురి కావడంతో మురికి నీరు ముందుకు వెళ్ళే వీలులేక వ్యర్థాలతో కూడిన మురికి నీరు వీధుల్లోకి చేరుతోందనీ , వర్షం కురిసినప్పుడు ప్లాస్టిక్, మానవ వ్యర్థాలతో వీధులన్నీ ప్రధానంగా 64 , 36 56, 66, 14, 80 ,84 ,76, విధులన్నీ కలుషితమవుతున్నాయని, కలరా , చర్మ సంబంధిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానిక మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణ సామర్థ్యానికి మించి ఆక్రమణలు చేపట్టడం వల్ల మొత్తం భవన నిర్మాణనికి మూలమైన పిల్లర్స్ , బీములపై అక్రమ నిర్మాణాలు జరగడం వల్ల భవనాల మనుగడ దెబ్బతింటుందని ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోమోనని గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న నివాసితులు, మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణల పై చాలా సార్లు స్థానిక రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధుల, కార్పొరేషన్ అధికారులు దృష్టికి, తీసుకు వచ్చామనిమన్నారు. అయితే లోపయియికారిగా అక్రమ నివాసితులకు మద్దతు ఉందని తెలుస్తోందని, వారికి చెప్పి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా కాలనీ లో కొందరు పెద్దల అవతారం ఎత్తి ఆక్రమణదారులు వద్ద ఎంతో కొంత ముడుపులు తీసుకొని స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ముట్ట చెబుతున్నారని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్రమణదారులు, అక్రమ నిర్మాణాలపై కొత్త గా బాధ్యతలు చేపట్టిన కార్పొరేషన్ కమిషనర్ కొరడా ఝులిపించా లని, అక్రమ నిర్మాణాలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మానవ వ్యర్థాలను డ్రైనేజీల్లో వదిలివేయడం తో దుర్గంధం వ్యాపిస్తోందని స్థానిక సచివాలయం ప్రణాళిక కార్యదర్శి, కార్పొరేషన్ ప్రణాళిక విభాగం అధికారుల, స్థానిక సానిటరీ ఇన్స్పెక్టర్ల దృష్టికి చాలాసార్లు తీసుకెళ్లామని అయినప్పటికీ అధికారులు స్పందించడం లేదని పలువురు మహిళలు వాపోయారు. గత దశాబ్ద కాలంగా తూర్పు రైల్వే స్టేషన్ రోడ్డు, షెల్టాన్ రోడ్డు, ఇటీవల కొత్తగా నిర్మించిన 100 అడుగుల రోడ్డు వాంబే గృహాల మీదుగా నిర్మించడంతో ఈ ప్రాంతంలో నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా మారింది. వీధుల్లోను, ప్రధాన రహదారులను, డ్రైనేజీలను స్థానికులు ఆక్రమించుకొని వాటిపై చిరు, బడ్డీ వ్యాపారాలు కొనసాగించడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయిని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికి రెండు సార్లు ఆక్రమణలు తొలగించాలని అధికారులు అల్టిమేటం

ఆవ వాంబే కాలనీలో ఇటీవల కాలంలో ఆక్రమణలు పెరిగాయని వాటి నుంచి పలు సమస్యలు వస్తున్నాయని స్థానికల

నుంచి ఫిర్యాదులు అందినట్లు కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇప్పటికి రెండు సార్లు ఆక్రమణలు తొలగించాలని నివాసితులకు, ఆక్రమణదారులకు ఆక్రమణలు తొలగించాలని అధికారులు అల్టిమేటం ఇచ్చారని తెలిపారు. కొత్తగా కమిషనర్ దృష్టిలో ఈ సమస్య పెట్టామని, ఇటీవల రెండు వారాల క్రితం మళ్లీ చెప్పామని అధికారులు తెలిపారు. డిసెంబరు 1వ తేదీ లోగా ఎవరికి వారు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించు కోవాలని, లేదంటే కార్పొరేషన్ అధికారులు యంత్ర సామాగ్రితో, పోలీసులు సహకారంతో తొలగించడం జరుగుతుందని హెచ్చరించిట్లు అధికారులు తెలిపారు.



## ప్రజల భద్రతే..

# కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యం.

- కోటిపల్లి రేవు,పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి సుభాష్.
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు.

**కె గంగవరం పెన్ పవర్ అక్టోబర్ 27:** బంగాళాఖాతంలో ఏర్పడిన 'మోంథా' తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం సందర్శించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కె గంగవరం మండలం కోటిపల్లిలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ పునరావాస కేంద్రంను పరిశీలించారు. కోటిపల్లి పుష్కర ఘాట్లను, రేవును ఆనుకుని ఉన్న వీధులలో తిరిగి ప్రజలను అప్రమత్తం చేశారు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశాలు ఉండడంతో ప్రజలంతా ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు రక్షిత మంచినీరు, ఆహారం, పాలు, తగిన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తుఫాను సంబంధిత సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ కి తెలియజేసి సహాయం పొందాలని సూచించారు. పలువురు ప్రజలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కూటమి ప్రభుత్వం ముందస్తుగా అన్ని రక్షణ చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, అన్ని విభాగాల అధికారులు కూడా తుఫాను సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారన్నారు. వాతావరణం ప్రశాంతంగా ఉందని అశ్రద్ధ వద్దని, ప్రజల భద్రతే ముఖ్యమన్నారు. ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా కూటమి ప్రభుత్వం ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ సెలవులు రద్దు చేయడం జరిగిందన్నారు. గతంలో వచ్చిన హుద్ హుద్, తిథలి తుఫాన్ల అనుభవంతో ఎలాంటి నష్టం జరగకుండా యుద్ధ ప్రాతిపదికన తగు రక్షణ చర్యలు చేపట్టామన్నారు. మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, స్థానిక కూటమి నాయకులు, వెంటూరి వీర్రాఘవులు, కోటిపల్లి సర్పంచ్ పేమ్మాడి బేబీ సత్తిబాబు, బీజేపీ నాయకుడు కర్రి చిట్టిబాబు, కంచుమర్తి బాబురావు, యువ నాయకులు, గొడవర్తి రామకృష్ణ చీకట్ల సోమేష్, చీకట్ల రాము,కోటిపల్లి మత్యకారసొసైటి ప్రెసిడెంట్ ఓలేటి సుబ్రహ్మణ్యం, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# మొంథా తుఫాను.. అప్రమత్తంగా ఉండాలి

### అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి- సీఎం చంద్రబాబు ఆదేశాలు





**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 27:** రాష్ట్రాన్ని ప్రభావితం చేస్తున్న మొంథా తుఫాను పరిస్థితులను సమీక్షిస్తూ సోమవారం అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాను మార్గం, గాలి వేగం, వర్షపాతం తీవ్రతను పరిశీలిస్తూ, ప్రమాదం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.కాకినాడ కలెక్టరేట్ నుంచి ఈ సమీక్షలో జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర ప్రత్యేకాధికారి కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ , జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జీఎం.హరిష్ బాలయోగి తదితరులు పాల్గొన్నారు.ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే తీర ప్రాంతాల్లో ప్రజలను సమయానికి తరలించి పునరావాస కేంద్రాలలో అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ అప్రమత్తం చేయాలని, గతంలో జరిగిన తుఫాన్ అనుభవాలను ఆధారం చేసుకుని ఇంకా సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఖచ్చితమైన సమాచారంతో అపోహలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు.ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# ప్రభుత్వ శాఖాధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 27:**తూర్పు గోదావరి జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ రెడ్ అలర్ట్ జారీ చేసిందనీ , గంటకు 50%-%60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కీర్తి చేకూరి సూచించారు. చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో నిలవకుండా, విద్యుత్ ఉపకరణాలను డిస్కనెక్ట్ చేసి భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రజలను కోరారు. రైతులు ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో పొలాలకు వెళ్లరాదని, వ్యవసాయ పరికరాలను భద్రపరచుకోవాలని కలెక్టర్ సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. తుపాను ప్రభావం దృష్ట్యా జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మంగళవారం సెలవు ప్రకటించారు. అన్ని ప్రభుత్వ శాఖాధి కారులు, ఫీల్డ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి తుపాను పరిస్థితులను పర్యవేక్షించాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు వెంటనే కంట్రోల్ రూమ్ నంబర్లకు సమా చారం ఇవ్వాలని ప్రజలను కోరారు. అత్యవసర సహాయ నంబర్లు: 112 , 1070 , 1800 425 0101 (24x7) సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు

# కంట్రోల్ రూమ్ సిబ్బంది

ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ రాజ్

**రంపచోడవరం, పెన్ పవర్ ,అక్టోబర్ 27 :**తుపానుకు సంబంధించిన కంట్రోల్ రూమ్ సిబ్బంది ఎప్పటికప్పుడు తుఫాను తగ్గేవరకు అందుబాటులో ఉండాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ ఆదేశించారు.
సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో హెల్త్ మానిటరింగ్ సెల్ హాల్లో ఏర్పాటు చేసిన తుపాను కంట్రోల్ రూమ్ను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో తుఫాను తగ్గేవరకు కంట్రోల్ రూమ్ లో ఉన్న అధికారులు సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి తుపానుకు సంబంధించిన సమస్యలు తెలుసుకొని నివేదికలు సమర్పించాలన్నారు. ఏడు మండలాల నుండి ఏ టైంలో నైనా తుఫాను బాధితులు కంట్రోల్ రూమ్ కు తెలియపరిచిన యెడల వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టే విధంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. తుఫాన్ కంట్రోల్ రూమ్ను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని ఏపీఓ జనరల్ డివిన్వి



రమణను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. ప్రాజెక్ట్ అధికారి వారి వెంట డిప్యూటీ తహసిల్దార్ పియాజ్ భాష(జిలాని) బి. మార్గదర్శి,పి.లక్ష్మిరెడ్డి,నాగేంద్ర,కంట్రోల్ రూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వాముల పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న కంబాల..

పడిపూజకు 25,000 వేలు రూపాయలు విరాళం






**కోరుకొండ, పెన్ పవర్,అక్టోబర్ 27:** కోరుకొండ గ్రామంలోని శ్రీ రుక్మిణి సమేత పాండు రంగస్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన అయ్యప్ప స్వాముల పడిపూజ కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలిత అయ్యప్ప స్వాములు, గ్రామస్తులు కంబాల శ్రీనివాసరావుకి ఘన స్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు. పడిపూజ కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు 25,000 వేలు రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, విదేశాల నుంచి మనదేశంలోకి దుర్మార్గులు చొరబడి హిందువులను నాశనం చేయడానికి కుట్రలు చేస్తున్నారని, వీటిని మనమందరం సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మన ధర్మాన్ని పరిరక్షించుకోవడానికి కలిసికట్టుగా నిలబడాలన్నారు. ఆలయాల అభివృద్ధికి, హిందూ ధర్మ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లికి పాదయాత్రగా వచ్చిన భక్తులు



**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 27 :**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు పశ్చిమ గోదావరి జిల్లా నవుడూరు సమీపంలోని నెలమూరు, చుట్టుపక్కల గ్రామాల నుంచి 250మంది భక్తులు పాదయాత్రగా సోమవారం వాడపల్లి చేరుకున్నారు.భక్తులు ఆదివారం ఉదయం 10 గంటలకు మహా పాదయాత్రగా బయల్దేరి, సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు వాడపల్లికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం భక్తులు ఆనంద తాండ్రలో మునిగిపోయారు. ఆలయ అధికారులు, సిబ్బంది చేసిన సమగ్ర ఏర్పాట్లను వారు ప్రశంసించారు.

# రైతులకు ఉద్యాన అధికారి సూచనలు





**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులకు ఆ శాఖ అధికారులు పలు సూచనలు చేశారు. సోమవారం సీతానగరం మండలంలోని లంక ప్రాంతాలలో ఉద్యాన అధికారి పి. రిని తమ సిబ్బంది రైతులతో కలిసి అరటి బొప్పాయి కూరగాయలు పూల పంటలను పరిశీలించారు. మొంథా తుఫాన్ ప్రభావం వల్ల రానున్న మూడు రోజులు అధిక వర్షాలు బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని అధికంగా సాగు చేసే పంటలు 2227 ఎకరాలు సాగులోఉన్నాయి . ప్రధానంగా అరటి కూరగాయలు 700 ఎకరాల సాగులో ఉన్నాయని అరటి తోటలపై ముందస్తు చర్యలు గురించి తెలియజేశారు. అలాగే కూరగాయల పంటలు అన్నీ చివరి దశలో ఉన్నందున రైతులు కోతకు వచ్చిన కూరగాయలను వెంటనే కోసి మార్కెట్కు తరలించుకోవాలని చెప్పారు. ఉద్యాన శాఖ అధికారి పి. రిని మాట్లాడుతూ తుఫాను ప్రభావం వల్ల నష్టాలు బారిన పడకుండా పంటలు కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు తెలిపారు. తోటల్లో నిల్వ ఉన్ననీటిని వీలైతే త్వరగా బయటకు తీసివేయాలని అరటి తోటకు విరిగిన చెట్లను రెండు పిలకలు వదిలి కోసివేయాలని చెట్లకు వెదురు కర్రలను పాతి ఊతమివ్వాలని నీరు తీసివేసిన తోటల్లో చెట్టుకు 100 గ్రాముల యూరియా 80 గ్రాముల పొటాషియం ఎరువులు వేసుకోవాలని ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటల సంరక్షణతో పాటు అన్నదాతలకు అండగా నిలవాలని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

# మాజీ సర్పంచ్ మత్సా నాగేశ్వరరావు గారికి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి నివాళి



**రావులపాలెం, పెన్ పవర్ అక్టోబర్ 27 :**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ మత్సా నాగేశ్వరరావు మృతిచెందిన విషయం బాధాకరం అని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు.సోమవారం ఊబలంకలో మత్సా నాగేశ్వరరావు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ, నాగేశ్వరరావు పార్టీకి అహర్నిశలు కృషి చేసిన సీనియర్ నాయకుడు. ఆయన చేసిన సేవలు మరువలేనివి. ఊబలంక గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటు," అని పేర్కొన్నారు.
జగ్గిరెడ్డి నాగేశ్వరరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# మంత్రి పార్థసారథిని కలిసిన కొండపల్లి రవి



**టీ నర్సాపురం, పెన్ పవర్, అక్టోబర్ 27 :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ మరియు ప్రజా సంబంధాల మంత్రి కొలుసు పార్థసారథిని మాజీ శాసనమండలి సభ్యులు మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావు తో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మరియు పశ్చిమగోదావరి జిల్లా బిసి విభాగాల కో ఆర్డినేటర్ కొండపల్లి రవి విజయవాడలోని వారి నివాసంలో కలిసి గతంలో 2019 టు 2024 వైసిపి ప్రభుత్వంలో ఇళ్ళు మంజూరు కాగా కొంతమంది నిర్మాణాలు చేసుకోలేదని అలాగే వైసిపి స్థానిక నాయకులు ఒకరి పేరుమీద ఇళ్ళు మంజూరు అయితే ఇంకొకరికి అవి కేటాయించి అక్రమంగా నిర్మాణాలు జరిపారని దానివలన ఇప్పుడు గృహాలకు ఆన్లైన్ చేసుకుంటుంటే గతంలోనే మీకు మంజూరు అయినట్టు చూపించడం వలన నిజమైన నిరుపేద లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారని వాటి విషయంలో మండల తహసిల్దార్ లకు ఆదేశాలు ఇచ్చి విచారణ జరిపి వారి పేర్లు ఆన్లైన్ జాబితా నుంచి తొలగించి నిజమైన నిరుపేద లబ్దిదారులకు ఆన్లైన్ చేసి గృహాలు మంజూరు చేయాలని అదే సమయంలో గతంలో జగనన్న ఇళ్ళ పేరుతో వైసిపి నాయకులు అనర్హులకు ఇంటి స్థలాలు కేటాయించారని వాటిమీద విచారణ జరిపి అవి పేదలకు అందజేయాలని మరియు సమాజంలో ప్రభుత్వానికి మరియు ప్రజలకు మధ్య వారధిగా వుండి ఏలాంటి సమయంలో అయినా న్యూస్ సేకరించే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరగా మంత్రి వెంటనే స్పందించి ఏలూరు కలెక్టర్ తో మాట్లాడి తీవ్ర తుఫాను హెచ్చరికలు వున్న నేపథ్యంలో సమీక్షలు అయినవెంటనే దీనిమీద దృష్టి పెట్టాలని ఆదేశాలు జారిచేయడం జరిగిందని వారు తెలిపారు.

# మొంథా తుఫాన్ ప్రభావం పట్ల నియోజకవర్గప్రజలుఅప్రమత్తంగా ఉండాలి.

రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..



**కోరుకొండ,సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంథా తుఫాన్ ప్రభావం చాలా ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు.సోమవారం ఉదయం ఆయన కార్యాలయం సోషల్ మీడియా ద్వారా ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ భారీన పడకుండా ప్రజలు రైతులు జాగ్రత్త వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సమర్ధవంతంగా మొంథా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రభుత్వం ప్రజలందరికీ విజ్ఞప్తి చేసిన విషయం అందరికీ తెలుసు అని తూర్పుగోదావరి జిల్లాలో జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి పూర్తిస్థాయిలో ప్రజలందరినీ అప్రమత్తం చేస్తూ ఎప్పటికప్పుడు తుఫాన్ యొక్క పరిస్థితులను వివరిస్తున్నారని ప్రతి ఒక్కరు కూడా మూడు రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు సెలవులు ప్రకటించడం జరిగిందని మూడు మండలాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తుఫాన్ వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగిన పూర్తిస్థాయిలో కోరుకొండ మండలం గాదరాడ తమ స్వగ్రామంలో అందుబాటులో ఉంటానని తుఫాను ద్వారా ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా ఫోన్ చేయవచ్చని 93849 99999 9482799999 ఫోన్ తెలుపు వచ్చునని తెలిపారు. ముఖ్యంగా శిధిల వ్యవస్థలో ఉన్న భవనాల్లో ఎవరు నివాసం ఉండొద్దని పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. విద్యుత్ స్తంభాల వద్ద ఎవరు ఉండవద్దని యంత్రాంగం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నారని మూడు మండలాల్లో ఎమ్మార్వోలు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉన్నారని వాతావరణ శాఖ కూడా పూర్తిస్థాయిలో భయానికంగా ఉండే పరిస్థితి ఉందని తూర్పుగోదావరి జిల్లా ను తుఫాన్ ప్రభావితం ఇబ్బంది పెట్టే పరిస్థితి ఉందని తెలియజేశారు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు లైన్లు చెట్ల కింద ఉండవద్దని అన్నారు. తుఫాన్ సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎక్కడ ఏ ప్రమాదం జరిగిన ప్రభుత్వం దృష్టికిఅధికారుల దృష్టికి నా దృష్టికి తీసుకురావాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు.

# సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంత తుఫాను కారణంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జంగారెడ్డిగూడెం ఆర్డిఓ ఎంవి రమణ సూచించారు. సోమవారం రౌతు గూడెం, పి నారాయణపురం కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాగులు, కాలువలు వర్షం కారణంగా పొంగి ప్రవహిస్తుంటే సిబ్బంది వాటి దగ్గర పహారా పెట్టాలని ఆదేశించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి సిబ్బంది అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఏజెన్సీలో చిన్నపాటి వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తాయని కనుక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాన్ హెచ్చరిక కారణంగా ప్రయాణాలు తగ్గించుకోవాలని అన్నారు. అవసరమైతే తప్ప ఇంటి బయట నుండి రాకూడదని సూచించారు. ఈమెతో పాటు జీలుగుమిల్లి తహసిల్దారు ఉదయ్, ఎస్సై వి క్రాంతి కుమార్ సిబ్బంది ఉన్నారు.

# ముంతా తుఫాను పై రైతులకు అవగాహన కార్యక్రమం.



**కె గంగవరం పెన్ పవర్ అక్టోబర్ 27**: ముంతా తుఫాను ప్రభావం నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి సూచించారు. సోమవారం నాడు కోట, రాజువైరి గ్రామాల్లో ఆయన క్షేత్రస్థాయిలో రైతులతో సమావేశమై తుఫాను కారణంగా వ్యవసాయ పంటలకు కలిగే ప్రభావంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సద్గురుమూర్తి మాట్లాడుతూ మంగళవారం నాడు తుఫాన్ తీవ్రత పెరిగి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండి చేల్లోని మురుగునీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎక్కడైనా పనలు మొలకెత్తిన పంటలు ఉంటే ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని స్ప్రే చేయడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో వీఏఏలు నానిబాబు, విజయ్,వీఆర్ఏ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# శివాలయం ప్రాంగణంలో మ్మొక్కలు నాటిన దేవస్థానం చైర్మన్

* దేవస్థానం కమిటీ చైర్మన్,బొర్రా ఆదినారాయణ



**వి.ఆర్.పురం పెన్.పవర్.అక్టోబర్.27:** మండలంలోని వడ్డిగూడెం పంచాయితీపరిధిలోని వడ్డి గూడెం గ్రామంలో సోమవారం శివాలయం దేవస్థానం కమిటీ చైర్మన్,బొర్రా ఆదినారాయణ,శ్రీసతి పార్వతీ రుద్ర కోటేశ్వరస్వామి,ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటడం జరిగింది.ఈసందర్భంగా శివాలయ దేవస్థాన కమిటీ చైర్మన్,బొ ర్రా ఆదినారాయణ మాట్లాడుతూ శ్రీసతి పార్వతీ రుద్ర కోటేశ్వరస్వామివారి ఉత్సాలను తిలకిం చేందుకు సుదూరప్రాంతాలనుండి వచ్చేభక్తులకు మంచి నీడలో సేదతీర్చుకోవటానికి మ్మొక్కలు ఉపయోగపడతా యని,ప్రతి ఒక్కరూ పరిఆవరణను కాపాడేందుకు మ్మొక్క లు నాటాలని,కోరారు.ఈ కార్యక్రమంలో ముత్యాల సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మోంథా తుఫాన్ వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

* ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు....



**కపిలేశ్వరపురం పెన్ పవర్ అక్టోబర్ 27:**బంగాళాఖాతంలో ఏర్పడిన మోంథా తీవ్ర తుఫాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాలు భారీ వర్షాల బారిన పడనున్నాయనీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మెన్, ఎమ్మెల్సీ, మండపేట నియోజకవర్గ వైసిపి ఇన్ ఛార్జ్ తోట త్రిమూర్తులు అన్నారు. నియోజకవర్గంలో సోమవారం మధ్యాహ్నం నుంచి ఇప్పటికే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గంటకు 50-60 కి.మీ. వేగంతో గాలులు వీయనుండగా, 10-15 సెం.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. డాక్టర్ బి అర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వైసిపి క్యాడర్ సహాయక చర్యల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖలు అలర్ట్‌లో ఉన్నాయన్నారు. వారి పనితీరును పరిశీలిస్తూ సహకరించండని సూచించారు. ముఖ్యంగా కపిలేశ్వరపురం, రాయవరం, మండపేట రూరల్, మండపేట టౌన్ ప్రాంత ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని కోరారు. విద్యుత్ స్తంభాలు, వైర్ల పట్ల మరింత జాగ్రత్త వహించాలని కోరారు. రైతులు పొలాల్లో చెట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయాణాలు వాయిదా వేసుకోవాలన్నారు. కుటుంబ సభ్యుల్లో పిల్లలు, వృద్ధులను ఇంట్లోనే ఉంచాలని, ఎమర్జెన్సీ కాంటాక్ట్‌లు తహసీల్దార్, పోలీస్ స్టేషన్ నంబర్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగానికి ఇది తీవ్ర ప్రభావం చూపబోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.వరి పంట పై ప్రభావ తీవ్రత తగ్గే విధంగా రైతులు ప్రత్యామ్నాయ చర్యలు చేసుకావాలన్నారు. తుపాను ప్రభావం తగ్గి రైతులకు మంచి జరగాలని ఆశించారు.

# మొంథా తుఫాన్ తో అధిక వర్షాలు రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఉద్యానవన శాఖ.





**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంథా తుఫాన్ కదలికలపై ఐఎండి హెచ్చరికలు దృష్ట్యా మండలంలో రానున్న రెండు మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాల కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో
ప్రభావంతో అధిక గాలులు,భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ,జిల్లా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.ఈ నేపథ్యంలో మండల ఉద్యాన శాఖ అధికారి కె. దివ్యశ్రీ, సహచర సిబంధితో పలు గ్రామాల్లో ఉద్యాన పంటలను క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు.

తీవ్రమైన గాలులు మరియు అధిక వర్షాలుతో అక్టోబర్ 27 న కాకినాడ సమీపంలో మొంథా తుఫాన్ తీరందాటే అవకాశం ఉన్నందున,రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉద్యానవన పంటలైన అరటి, బొప్పాయి, మరియు కూరగాయలకు రైతులకు తుఫాన్ వల్ల సంభవించే నష్టాన్ని నివారించడానికి రైతులు తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.అరటి గెలలు ఉన్న ఎత్తుగా పెరిగిన అరటి చెట్లకు వెదురు కర్రలు, కలప స్తంభాలతో రెండు వైపులా గట్టిగా ఊతం ఇవ్వాలని తెలిపారు.కోతకు సిద్ధంగా ఉన్న గెలలను అవకాశం ఉంటే కోసి సురక్షితమైన ప్రదేశానికి తరలించాలన్నారు.గాలి తాకిడిని తగ్గించడానికి ఎండిన లేదా పూర్తిగా వంగిపోయిన పాత ఆకులను జాగ్రత్తగా తొలగించాలని తోటల్లో నీరు నిలవకుండా ఉండేందుకు మురుగు కాలువలను లోతుగా త్రవ్వి సిద్ధం చేయాలన్నారు.బొప్పాయి పంట పట్ల అప్రమత్తంగా ఉండాలని పక్వానికి వచ్చిన లేదా పూర్తిగా పెరిగిన బొప్పాయి కాయలను తక్షణమే కోసి భద్రపరుచుకోవాలన్నారు.మధ్య వయస్సులో ఉన్న లేదా ఎత్తుగా ఉన్న మొక్కలు గాలికి విరిగిపోకుండా బలంగా కర్రలతో కట్టాలని సూచించారు. బొప్పాయి మొక్కల మొదళ్ల వద్ద నీరు నిలవకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.కూరగాయల పంటలు టొమాటో, వంకాయ, బెండ, మిరప వంటి పంటలలో కోతకు సిద్ధంగా ఉన్న కాయలు, పండ్లను తక్షణమే కోసి సురక్షిత ప్రాంతానికి తరలించాలని,తీగజాతి కూరగాయలు (బీర, కాకర, సొర) ఉన్న పందిళ్లు గాలికి కూలిపోకుండా, స్తంభాలను, తీగలను గట్టిగా కట్టి భద్రపరచుకోవలన్నారు. తుఫాను ముందు లేదా సమయంలో ఎలాంటి పురుగు మందులు/ఫంగిసైడ్స్ పిచికారీ చేయరాదన్నారు. చేసిన వృధా అవుతాయి అన్నారు. తుఫాను ప్రభావం మొదలైన తర్వాత పొలాల్లోకి రైతులు వెళ్లడం ప్రమాదకరమని, రైతన్నలు తమ ప్రాణాలకు, పశువులకు రక్షణ కల్పించుకుంటూ, చర్యలను తుఫాన్ మొదలవ్వక ముందే పూర్తి చేయాలని కోరారు.ఏదయినా నష్ట సంభవిస్తే సహాయం కోసం ఉద్యాన శాఖ, అధికారులను, రైతు సేవా కేంద్ర సిబ్బంది ని సంప్రదించాలని అధికారులు రైతులకు తెలిపారు.

# ముగ్గళ్ళ గోదావరి మాత అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న కంబాల.

**ఆలయానికి ఐరన్ గ్రిల్స్ వేయించడానికి కంబాల 63,000 వేలు రూపాయలు విరాళం**






**సీతానగరం పెన్ పవర్, అక్టోబర్ 27:** సీతానగరం మండలంలోని ముగ్గళ్ళ గ్రామంలోని గోదావరి మాత ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలిత ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఆలయంలో అమ్మవారిని దర్శించికుని, తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. గోదావరి మాత ఆలయానికి ఇరువైపులా ఐరన్ గ్రిల్స్ వేయించడానికి 63,000 వేలు రూపాయలు విరాళాన్ని కంబాల శ్రీనివాసరావు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన. మాట్లాడుతూ మన ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు స్వదేశీ వస్తువులనే వాడాలని వారికి అవగాహన కల్పించారు. రంపచోడవరం, జగ్గంపేట, రాజానగరం మూడు నియోజకవర్గల్లో ఆలయాల అభివృద్ధికి, విద్య, వైద్య, ఆర్థిక పరంగా కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ నేపథ్యంలో పశువుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి

**నెల్లిపూడి జూనియర్ వెటర్నరీ అధికారి డాక్టర్ పరిశిక. అప్పన్నబాబు.**



**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంత తుపాన్ ప్రభావం వలన మండలం లో గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయి కనుక రైతులు వారి యొక్క పశువులు పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని నెల్లిపూడి పశు వైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారి డాక్టర్ పరిశిక. అప్పన్నబాబు రైతులకు సూచించారు. పశు వులను బలంగా ఉండే పాకలలో , షెడ్ లో కట్టుకోవాలని,
పిడుగులు పడే చోట చెట్ల క్రింద పశువులు కట్టవద్దని చలి గాలి తగలని ప్రదేశం లో వాటిని ఎత్తియిన ప్రదేశం లో కట్టుకోవాలని సూచించారు .అదే విధంగా మేకలు, గొఱ్ఱెలు గల యజమానులు వాటికీ ఈదురుగాలులు తగలకుండా ఉండేందుకు ఈ రెండు రోజులు మేతకి తీసుకొని వెళ్లకుండా వాటికీ మేత అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, తుఫాన్ ప్రభావం వలన వీచే ఈదురుగాలుల వల్ల కోళ్లు కూడా మరణించే అవకాశం ఉందని తెలిపారు. పశువులు ఏవిధమైన అనారోగ్యం నకు గురియినా, ప్రమాదవశాత్తు ఏదయినా జరిగినా వెంటనే సమీప సచివాలయ పశు సవర్ధ సహాయకులను గానీ, సమీప పశు వైద్య శాలకు గానీ వెంటనే తెలియపర్చాలని అయన రైతులను కోరారు.

# తుఫాను ప్రభావం లేకుండా జిల్లా రక్షణ చర్యలు పటిష్టం

**ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా చర్యలు తీసుకోండి- ఇన్‌చార్జ్ మంత్రి నారాయణ ఆదేశాలు**








**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 27:**వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను కారణంగా కాకినాడ జిల్లాలో ముప్పు నెలకొన్న నేపథ్యంలో, ఒక ప్రాణ నష్టం కూడా జరగకుండా నిరోధించేందుకు పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడిన ఆయన తుఫాను ఉధృతి 1996 తుఫాను స్థాయిలో ఉండొచ్చని వాతావరణ సూచనలు ఉన్నందున, ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను కఠినంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు.ఈ సమావేశంలో తుఫాను ప్రత్యేకాధికారి, రాష్ట్ర పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి కృష్ణతేజ, ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, గంటి హరీష్ మాధూర్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ బిందుమాధవ్ చేపట్టిన చర్యలను వివరణాత్మకంగా వివరించారు. మంత్రివర్యులు సమావేశం తరువాత మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ముఖ్య చర్యలను వెల్లడించారు. 24%ఇ%7 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు, 269 పునరావాస కేంద్రాలు సిద్ధం.త్రాగునీరు,ఆహారం, వైద్య సదుపాయాలు, విద్యుత్, ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులో7 రోజులకు సరిపడ నిత్యావసరాలు నిల్వ. ఎస్ డి ఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు రంగంలోకి,50 మంది ఎస్ డి ఆర్ ఎఫ్, 30 మంది ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు%ొ% 40 బోట్లు, 140 ఈతగాళ్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. 142 గర్భిణీలు, బాలింతలను ముందుగానే తరలింపు,వైద్య శిబిరాలు, అత్యవసర మందులు అందు బాటులో ఉంచడం జరుగింద న్నారు. పాఠశాలలకు 27-29 తేదీలవరకు సెలవులు,14,499 మంది విద్యార్థులు ఇళ్లకు పంపించడం జరిగింది.మత్స్యకార వేటపై పూర్తి నిషేధం.సముద్రంలో ఉన్న పడవలన్నీ వెనక్కి రప్పించారు. రైతులకు సూచనలు పంట కోత వాయిదా, పశువుల రక్షణ ఏర్పాట్లు విద్యుత్ పునర్వ్యవస్థీకరణ కు రాయల సీమ నుండి 1000 మంది విద్యుత్ సిబ్బందిని రప్పించడం జరిగిందన్నారు.త్రాగునీరు, రవాణా భద్రతఇబ్బందులు తలెత్తితే వెంటనే పునరుద్ధరణ చర్యలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. సోషల్ మీడియాలో అపోహలు వ్యాప్తి చేయవద్దని హెచ్చరిక జారీ చేశారు. మొంథా తుఫాను కారణంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా పరిపాలన కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వ ప్రధాన లక్ష్యం "ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకూడదు" అని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# నగరంలో రూ.1.95 కోట్ల తో  ఐదు పార్కులు అభివృద్ధి





**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 27:** నగరంలో పలు ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధిచేసి సుందర నందనవనంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు.
స్థానిక 10వ డివిజన్ మోరంపూడి కాలనీలో సుమారు రూ.15 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన పార్కును జనసేన పార్టీ సిటీ ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ, సుమారు రూ. కోటి 95 లక్షలతో నగరంలో ఫేజ్ -1లో ఐదు పార్కులను అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. నగరంలో జరిగిన అభివృద్ధి టీడీపీ పాలనలోనే జరిగిందన్నారు. కంబాల చెరువు పార్కును అభివృద్ధి చేసి నగరంలోని ప్రజలందరినీ అక్కడికే రావాలనడం తమ విధానం కాదని ఆయన అన్నారు. నగరంలోని 30 పార్కులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా పార్కుల్లో సౌకర్యాలు సమకూర్చుతున్నామని, పార్కుల్లో జిమ్‌లు ఏర్పాటు చేయడంతో ప్రజలు వ్యాయామం చేసుకుని ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాలకులు నగరంలోని రోడ్లు, అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. వారికి కావాల్సిన గుత్తేదారులకు పనులు అప్పజెప్పి అరకొరగా పనులు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా డివిజన్ల కమిటీ సభ్యులు, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు,





**కె గంగవరం పెన్ పవర్ అక్టోబర్27:**
శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైన పవిత్ర కార్తీకమాసం
మొదటి సోమవారం సందర్బంగా మండలంలో గల అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.కె గంగవరం మండలం కోటిపల్లి లో తెల్లవారుజాము నుండి భక్తులు అధిక సంఖ్యలో గౌతమి గోదావరిలో పుణ్యస్నానమాచరించి శివునికి ప్రీతి కరమైన రోజు సోమవారం సందర్భంగా శ్రీ ఛాయా సోమేశ్వరస్వామినీ అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారిని అమ్మవార్లను పువ్వులతో ప్రత్యేక అలంకరించారు ఆలయ ఈవో భీమశంకరం స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులకు ఏ అసౌకర్యం కలుగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసారు అదేవిధంగా కె గంగవరం మండలం అన్ని గ్రామాల్లో శివాలయంలో హరిహర నామాలతో శివాలయాలు మార్మోగాయి. కె గంగవరం మండలం పాతకోట గ్రామంలో శ్రీ లోపాముద్రంబ అగస్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. యండగండి గ్రామంలో సోమేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక వన సమారాధన.





**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 27:** మండల కేంద్రమైన కిర్లంపూడి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఏఎన్ఎల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మొదటి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు నైదాన బాబ్జి ( రఘు) ఆధ్వర్యంలో వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు, నీటిపారుదల శాఖ విశ్రాంత ఉద్యోగి పెంటకోట మూర్తి ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ కార్తీక సమారాధన కార్యక్రమానికి శ్రీ కొక్కొండ రామ శేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వాకర్స్ క్లబ్ సభ్యులతోపాటు, కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం, గ్రామాలకు చెందిన పలువురు అయ్యప్ప స్వాములు, పత్రికా విలేకరులు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని అన్న ప్రసాదములు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పెంటకోట మూర్తి, నైదాన బాబ్జి, పలువురు వాకర్స్ కబ్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్తీక వన సమారాధన కార్యక్రమానికి అధిక సంఖ్యలో విచ్చేసి అన్న ప్రసాదములు స్వీకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, సీనియర్ రాజకీయ నాయకులు ఎస్ ఎస్ రాంకుమార్, సీనియర్ విశ్రాంత వైద్యాధికారి, ఎం తిరువెంగళాచార్యులు,వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు,మళ్ల నాగు, శరణం తాతాజీ, ఎల్లపు నానాజీ,దాడి పెద బుజ్జి,గొడే, శేఖర్,గొడే బుజ్జి, ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు, పలువురు వాకర్స్ క్లబ్ సభ్యులు , మహిళలు పాల్గొన్నారు

## వస్తోంది 'మొంథా' ఉన్నాం మే'మంతా'...




**సీ.ఐ భీమరాజు.**

**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంథా తుఫాను నేపథ్యంలో చేయవలసిన సహాయక చర్యలపై సర్కిల్ ఎసై లతో సమీక్ష నిర్వహించిన సీ.ఐ భీమరాజు...
పి.గన్నవరం సర్కిల్ పరిధిలో ఉన్న ప్రజలందరికీ భరోసా కల్పించిన సీ.ఐ భీమరాజు. ప్రజలందరూ కూడా భయపడాల్సిన అవసరం లేదని అందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఏ అవసరం వచ్చినా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలని సిబ్బంది అందుబాడులో ఉండి వెంటనే స్పందించి తగు చర్యలు చేపడతామని విలేఖరులతో తెలియజేసిన సీ.ఐ భీమరాజు...

## అన్నా క్యాంటీన్ లో పేదలకు ఉచిత అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 27:** స్థానిక కాకినాడ రోడ్ లోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద గత నాలుగు సంవత్సరాలుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ వారం జగ్గంపేట గ్రామానికి చెందిన జుజ్జవరపు శ్రీనివాస్ చౌదరి, బుజ్జి దంపతులు ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు జీనుమణి బాబు హాజరై పేదలకు అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి యువనేత పాలచర్ల నాగేంద్ర చౌదరి, పాండ్రంగి రాంబాబు, మండపాక అప్పన్న దొర, వేములకొండ జోగారావు, డేగల సత్తిబాబు, దాపర్తి సీతారామయ్య, నండ్ల చిరంజీవి, ఎండి కాజా, షేక్ వల్లి, పుర్రె వీరబాబు, అప్పాజీ, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల క్షేత్రస్థాయిలో అవగాహన పెంచుకోవాలి




**ఎంపీడీవో లక్ష్మణరావు**

**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 27:**విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకునే చదువుతోపాటు క్షేత్రస్థాయిలో అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో లక్ష్మణరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్ఎం వరలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పీహెచ్సీ ని సందర్శించి విద్యార్థులు పిహెచ్ పనితీరు, ఉద్యోగుల విధులు గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు లక్ష్మణ్, విశ్వనాథ్, వైద్యులు మనోహర్, ఒకేషనల్ ట్రైనర్స్ భాగ్యలక్ష్మి సుష్మ ఉన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు





**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 27**: కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో జగ్గంపేట మండల గ్రామాల్లోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే మహిళలు ఇంటివద్దే పూజల నిర్వహించుకుని అనంతరం ఆలయాలకు విచ్చేసి అర్చనలు అభిషేకాలు చేయించారు. దీనిలో భాగంగా జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి శివ కేశవుల క్షేత్రానికి భక్తులు వేలాదిగా తరలివచ్చి ఏలేరులో స్నానం చేసి శివకేశవల దర్శనం చేసుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

## ఎన్డీయే కూటమి శ్రేణులు, జనసైనికులు సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలి..

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ





**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 27**:లంక ప్రాంతాల్లో ఉండే వారు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దు..
పూరి గుడిసెల్లో ఉండేవారు సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు వెళ్ళాలి..
రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా మీకు తోడుగా ఉంటుదనిపి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు.
మొంథా తుఫాన్ తీవ్రతరం కావడంతో రాబోవు రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచే వర్షాలు కురుస్తుండగా.. భారీగా గాలులు వీస్తాయని, అధిక వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎన్డీయే కూటమి శ్రేణులు, జనసైనికులు, కార్యకర్తలు సహాయక చర్యల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. పి.గన్నవరం నియోజకవర్గంలో లంక ప్రాంతాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎవరూ అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లంక గ్రామాల్లో పర్యటించి గ్రామస్థులకు భరోసా కల్పించారు. ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు అన్ని శాఖలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పూరి గుడెసల్లో ఉండేవారు సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్ళాలని కోరారు. ఎళ్ళవేలలా మీకు అందుబాటులో ఉంటానని తుఫాను విషయంలో ఎవరూ అధైర్య పడవద్దని లంక ప్రాంత వాసులకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు..

## ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు 31 వరకు గడువు పొడిగింపు..



**అమలాపురం రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 27:** ఇంటర్మీడియట్ చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు, గతంలో పరీక్షలు తప్పిన విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించే విషయంలో ఈ నెల 31వ తేదీ శుక్రవారం వరకు గడువును ఇంటర్మీడియట్ విద్యా మండలి పొడిగించింది.నవంబర్ 1వ తేదీ శనివారం నుంచి ఆరవ తేదీ గురువారం వరకు వెయ్యి రూపాయలు అపరాధ రుసుముతో ఫీజు చెల్లించవలసి ఉంటుంది.ఇంకను పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఈ విషయమును గమనించి ఈ అవకాశమును వినియోగించుకోవలసిందిగా ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి వనము సోమశేఖరరావు తెలిపారు...

# తాటాకిళ్లలోని నివాసులను తక్షణమే పునరావస కేంద్రాలకు తరలించాలి

* కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్





**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్27:**మొంథా తీవ్ర తుఫానుగా మారుతున్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ అన్నారు. అంబాజీపేట, నందంపూడి, తొండవరం. వక్కలంక, మాచవరం గ్రామాల్లో ఉన్న పునరావస కేంద్రాలను సోమవారం ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రానున్న మూడు రోజులు పాటు ఈదురు గాలులతో పాటు భారీ వర్షాలు కురుస్తాయని గ్రామాల్లో ఉన్న ప్రతీ అధికారి అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను, కూలేందుకు సిద్ధంగా . ఉన్న తాటాకిళ్లలోని నివాసులను తక్షణమే పునరావస కేంద్రాలకు తరలించాలన్నారు. లేని పక్షంలో వారి బంధువుల ఇంటికి వెళ్లే చూడాలన్నారు. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్తితులు, గ్రామ వివరాలను తెలియజేయాలని సూచించారు. అధికారులంతా ప్రజలకు అండగా ఉంటూ చైతన్య పరుచుకోవాలన్నారు. ప్రజలు ఇంటిలోనే సురక్షితంగా ఉండాలన్నారు. మండలంలో 32 పునరావస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 40 పూరి గుడిసెలను గుర్తించామని వారిని పునరావస కేంద్రాలకు తరలించే ఏర్పాటు చేశామన్నారు. పునరావస కేంద్రాలకు వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం గురికాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్డీఓ వెంట పి.గన్నవరం నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా వ్యసాయాధికారి బోసుబాబు, తహసీల్దార్ బి. చినబాబు, ఎంపీడీఓ బి.మమత, ఎస్సై కె. చిరంజీవి, ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, విద్యుత్ శాఖ అధికారులు, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

# పారిశుధ్య కార్మికులకు రైన్ కోట్లు పంపిణీ

* వారే పట్టణ పరిశుభ్రత కాపాడుతున్న వాస్తవ వీరులు -అధికారులు



**అమలాపురం రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 27:**వర్షాకాలంలో ప్రజల ఆరోగ్య రక్షణ కోసం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య సిబ్బంది భద్రతను దృష్టిలో పెట్టుకుని రైన్ కోట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ఆదేశాల మేరకు అమలాపురం పురపాలక సంఘంలో పనిచేస్తున్న 150 మంది పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్ర మణి, మున్సిపల్ కమిషనర్ వి. నిర్మల్ కుమార్ చేతుల మీదుగా రైన్ కోట్లు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, వర్షపు కష్టాలు పట్టించుకోకుండా ప్రజా సేవలో ముందుండే పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యం, భద్రతపై సంరక్షణ అవసరమని పేర్కొన్నారు. మిగిలిన సిబ్బందికి కూడా త్వరలోనే రైన్ కోట్లు పంపిణీ చేస్తామని తెలిపారు.పట్టణ పరిశుభ్రతను మరింత బలోపేతం చేయడానికి పారిశుధ్య సిబ్బందికి అవసరమైన పనిముట్లు, పరికరాలు పూర్తి స్థాయిలో అందజేసినట్టు కమిషనర్ తెలిపారు. తుఫాన్ ప్రభావ సమయంలో ప్రజలకు ఎప్పుడూ అండగా నిలిచి సేవలు అందిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# గ్రామాల్లో వైసిపి కోటి సంతకాల సేకరణ



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 27:**పేదలకు విద్య, ప్రజలకు మెరుగైన వద్యైం అందకుండా దూరం చేయడానికి చంద్రబాబు సారధ్యంలో కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. పసుపల్లి, వక్కలంక, కముజువారిలంక, ఇరుసుమండ గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్యక్షతన రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణను నిరశిస్తూ కోటి సంతకాల సేకరణను సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను కార్పోరేట్లకు దారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ఇవ్వకుండా, పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే నడిపించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తూ తన బినామీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్.జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా పేదలకు సైతం కార్పోరేట్ విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించారన్నారు. రాష్ట్రంలో వైద్య విద్యను ప్రోత్సహించడానికి 17 మెడికల్ కళాశాలల నిర్మాణం ప్రారంభిస్తే కూటమి ప్రభుత్వం వాటికి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని చూడడం దారుణమన్నారు. కోటి సంతకాల సేకరణకు అనూహ్యమైన స్పందన లభిస్తోందని ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేటీకరణను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎం. ఎం. శెట్టి, మందపాటి కిరనక్కుమార్. మట్టపర్తి నాగరాజు. గంటి శ్రీను, దొమ్మేటి రాధాసూర్యనారాయణ, యల్లమిల్లి జయబాబు, సానబోయిన మురళీ, దేవరపల్లి బాలయోగి, సూదాబత్తుల రాము పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ సన్నాహకాలు పర్యవేక్షణ

* ప్రజల భద్రతే ప్రాధాన్యం - రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు

**కాకినాడ రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 27:**మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ప్రజలకు అందుతున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తో కలిసి సోమవారం పర్యటించారు. ముందుగా వారు కాకినాడ రూరల్, కరప మండలం పగడాలపేట ఉప్పలంక ప్రాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ప్రజల కోసం ఏర్పాటుచేసిన మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్తు, వైద్య శిబిరం, భోజన ఏర్పాట్లు వంటి అంశాలపై అధికారులు తీసుకున్న చర్యలను వివరంగా విచారించారు. పగడాల పేటలో పాకల్లో నివసిస్తున్న కుటుంబాల వద్దకు వెళ్లి తుఫాన్ తీవ్రత పెరగే అవకాశాలున్నందున ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని ప్రజలకు సూచించారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గేంతవరకు కేంద్రాల్లోనే సురక్షితంగా ఉండాలని అవగాహన కల్పించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజల ప్రాణ నష్టం జరగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టినట్టు, పునరావాస కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్,



సీనియర్ నాయకుడు తోట నవీన్, కూటమి నాయకులు ఇతరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నీస్ పోటీలలో విజేత మణికంఠ

**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 27:**రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నీస్ పోటీల్లో గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న బొక్కా సత్యశివశ్రీసాయి మణికంఠ తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం సాధించాడని హెచ్ఎం అక్కిరాజు శేషసాయి, పీడీ ఆసు వెంకత సూర్యమథు తెలిపారు. ఈ నెల 25. 26 తేదీల్లో విశాఖపట్నం జిల్లా గోపాలపట్నంలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నీస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆండర్ 19 విభాగంలో మణికంఠ పాల్గోని తృతీయ స్థానం కైవసం చేసుకున్నాడన్నారు. తనతో పాటు అండర్ 17లో చొల్లంగి జాహ్నవిశివదుర్గ. అండర్ 17, 19 విభాగాల్లో పంటపాటి నాగశ్రీదుర్గ, సాదా నిఖితదేవిలు పాల్గొన్నారన్నారు. రాష్ట్ర స్థాయిలో పోటీల్లో తృతీయ స్థానం సాధించిన మణికంఠను హెచ్ఎం తోపాటు సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, ఇంద్రశేఖర్, ఎస్ఎంసీ చైర్మన్ తొత్తరమూడి గోవిందులు అభినందనలు తెలిపారు..



# తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 27:**మొంథా తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరాలో ఏర్పడే అవాంతరాలను తక్షణం పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అన్ని చర్యలు చేపట్టినట్లు ఏపీఈపీడిసి ఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్. శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రం ఆలమూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో విద్యుత్ తీగలు తెగడం, స్తంభాలు పడిపోవడం వంటి సమస్యలను వెంటనే సరిచేసేందుకు మండపేటలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే ఈ క్రింది నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

మండపేట టౌన్ : 9440904519
ద్వారపూడి సెక్షన్: 9440904527
ఆలమూరు సెక్షన్: 9440904521
రాయవరం సెక్షన్: 9493178873
ఏడిద సెక్షన్: 9440904503
మండపేట,రాయవరం,ఆలమూరు మండలాల సమస్యల కోసం: 9493178836

సంప్రదించండన్నారు.స్థానిక విద్యుత్ సిబ్బందిని కూడా అవసరమైతే సంప్రదించాలని సూచించారు.అలాగే,తెగిపడిన విద్యుత్ తీగలు లేదా పడిపోయిన స్తంభాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, తుఫాన్ సమయంలో విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావడానికి నిరంతరం కృషి చేయనున్నట్లు శ్రీధర్ వివరించారు.

# జనార్ధన స్వామి ఆలయంలో యాత్రికునికి అస్వస్థత.

ప్రాథమిక వైద్య సేవలందించిన అర్చకులు సాయి.



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 27:**మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధన స్వామివారి ఆలయంలో సోమవారం కాలినడకన వచ్చిన యాత్రికుడు ఆలయానికి ప్రదక్షిణ చేస్తూ అస్వస్థత గురై కుప్పకూలాడు. వెంటనే స్పందించిన ఆలయ అర్చకులు అంగర సాయి భగవాన్ ఆచార్యులు ఆ భక్తునికి తక్షణమే ప్రాథమిక వైద్య సహాయం అందజేశారు. దానితో ఆ భక్తుడు వెంటనే కోలుకున్నాడు. భక్తుడు అస్వస్థతకు గురికాగానే స్పందించి వైద్యం అందించిన ఆలయ అర్చకులు భగవానాచార్యులను ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, పలువురు గ్రామస్తులు అభినందించారు.

# ఈనెల 31 లోగా మార్చి 2026 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు రుసుము చెల్లించాలి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 27:**మార్చి 2026లో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే జనరల్ , వృత్తి విభాగాల మొదటి, రెండవ సంవత్సర విద్యార్థులు రెగ్యులర్ , ఫెయిల్ అయిన (ప్రైవేట్) అభ్యర్థులు ు తమ పరీక్ష రుసుములు చెల్లించాల్సిన గడువు తేదీలను అధికారులు ప్రకటించారు. పరీక్ష రుసుము చెల్లించడానికి చివరి తేదీ 31-10-2025 వరకు జరిమానా లేకుండా చెల్లించవచ్చునని, రూ.1000 జరిమానాతో 06-11-2025 వరకు చెల్లించడానికి గడువు ఉందని అధికారులు తెలిపారు. ఈ మేరకు అన్ని కళాశాలల ప్రిన్సిపల్‌లకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఇంటర్మీడి యట్ విద్యాధికారి ఎన్.ఎస్.వి.ఎల్. నరసింహం తెలిపారు. విద్యార్థులు గడువు లోపు రుసుములు చెల్లించి పరీక్షలకు అర్హత పొందాలని ఆయన సూచించారు.

# తోకాడ శివాలయానికి కంబాల లక్ష రూపాయలు విరాళం



**గోకవరం పెన్ పవర్,అక్టోబర్ 27 :** రాజానగరం మండలం తోకాడ గ్రామంలోని శివాలయానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు లక్ష రూపాయలు విరాళాన్ని సోమవారం కమిటీ సభ్యులకు అందజేశారు. తోకాడ గ్రామంలోని శివాలయం ఆలయ శంకుస్థాపనకు గతంలో కంబాల శ్రీనివాసరావు వెళ్లారు. అప్పటిలో ఆలయ నిర్మాణానికి సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. అప్పటిలో లక్ష రూపాయలు విరాళాన్ని ప్రకటించారు. దీనిలో భాగంగా కమిటీ సభ్యులు వేగిసేట్టి చక్రం, సత్తిబాబు, దుర్గారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు కంబాల శ్రీనివాసరావు వద్దకు రాగా లక్ష రూపాయలు విరాళం చెక్ ను సీఎండీ కార్యాలయం వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఉద్యాన పంటల రక్షణకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి



**డి హెచ్ వో ఎన్. మల్లిఖార్జున రావు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 27:**రైతులు తుఫాన్ సంబంధిత హెచ్చరికలు, సూచనలను ఉద్యాన శాఖ అధికారుల ద్వారా సకాలంలో తెలుసుకొని, పంటలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎన్. మల్లికార్జునరావు సోమవారం విజ్ఞప్తి చేశారు. ఉద్యానశాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు, తూర్పు గోదావరి జిల్లాలో ఉద్యాన శాఖ అధికారులు మొంథా తుఫాను ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో సుమారు 1,62,000 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులో ఉండగా, తుఫాను కారణంగా బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంటలను రక్షించుకోవాలని రైతులకు సూచించారు.

అరటి, బొప్పాయి, కూరగాయలు, పూల పంటల రైతులు ముందస్తుగా సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. తోటలలో నిల్వ నీటిని వెంటనే బయటకు పంపించి, చెట్లకు ఊతం ఇవ్వాలని సూచించారు. వర్షం ఆగిన వెంటనే యూరియా, పొటాషియం వంటి ఎరువులను, సస్యరక్షణ మందులు పిచికారి , గాలి ప్రసరణకు తగిన ఏర్పాట్లు చేయడం ద్వారా నష్టాలను తగ్గించవచ్చని తెలిపారు.

రైతులకు వాట్సాప్ గ్రూపుల ద్వారా హెచ్చరికలు, సూచనలు పంపించడమే కాకుండా, మండల, గ్రామ స్థాయిలో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశామని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎన్. మల్లికార్జునరావు తెలిపారు.

# మెంథా తుఫాన్‌పై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

* రాష్ట్ర విప్ బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ అక్టోబర్ 27 :**మెంథా తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమిష్టిగా పని చేస్తూ ప్రజల రక్షణ చర్యల్లో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు.

వాతావరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతుంటాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, త్రాగునీరు, విద్యుత్ వంటి అవసరమైన సౌకర్యాలపై ఎల్లప్పుడూ పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

అత్యవసర పరిస్థితుల్లో తాడేపల్లిగూడెం రెవిన్యూ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్స్ ద్వారా ప్రజలకు సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని, వాటి గురించి గ్రామస్థాయిలో ప్రచారం చేయాలని ఆయన సూచించారు.

ఈ సందర్భంగా ఆయన నందమూరి గ్రామంలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, లోతట్టు ప్రాంతాల్లో పంట నష్టాలను నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

అలాగే, కూటమి నాయకులు ప్రజల్లో అప్రమత్తత కల్పించడంలో భాగస్వాములవ్వాలని కోరారు.

అధికారులు తరచుగా ప్రదేశాలను పరిశీలిస్తూ రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, ఇరిగేషన్ డి.ఇ. కె. ధర్మజ్యోతి, ఎమ్మార్వో సునీల్ కుమార్, అడపా ప్రసాద్, చెరుకూరి సోమశేఖర్, మద్దిపాటి ధర్మేంద్ర, వట్టికూటి వెంకటేశ్వరరావు, సెనగల శ్రీనివాస్ గౌడ్, రైతులు, గ్రామస్తులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫానుపై అప్రమత్తం

## ఉప్పాడ కొత్తపల్లి బీచ్‌ను పరిశీలించిన జిల్లా అధికారులు

## పల్లప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపు





**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించకుండా పూర్తి స్థాయి సన్నద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. సోమవారం ఆయన ప్రత్యేక అధికారి,పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణ తేజ్, జిల్లా ఎస్పీ జీ.బిందు మాధవ్ తో కలిసి యూ.కొత్తపల్లి మండలంలోని సముద్రతీర ప్రాంతాలను పర్యవేక్షించారు.తీవ్ర గాలులతో ఎగసి పడుతున్న సముద్ర కెరటాలను వర్షంలో తడుస్తూనే పరిశీలించిన అధికారులు ముందస్తు చర్యలపై అధికారులు సరైన దృష్టి పెట్టాలని ఆదేశించారు. పల్లప్రాంతాలలోని లోతట్టు, పాక ప్రాంతాల్లో ఉన్న కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సూచనలు జారీ చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ తుఫాను ప్రభావం వీధికో బీభత్సంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రెవెన్యూ, పంచాయతీ,పోలీస్ శాఖలు అఖండ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి అధికారి, సిబ్బంది తమ తమ కార్యస్థానాల్లో అందుబాటులో ఉండి వెంటనే స్పందించాలన్నారు. మురుగు నీరు, మంచినీటి కలుషీకరణ వంటి సమస్యలు ఎదురుకాకుండా అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిన వెంటనే తొలగించి రాకపోకలు సవ్యంగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొ న్నారు. విద్యుత్ నిలిపివేత జరిగినా వెంటనే పునరుద్ధరణకు అవసరమైన యంత్రాంగం, క్రేన్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు.ప్రత్యేక శ్రద్ధ అవసరమైన గర్భిణీలు, బాలింతలు, వృద్ధులను ఆసుపత్రులకు తరలించిన విషయంపై విచారించిన కలెక్టర్, అన్ని ఏర్పాట్లు సక్రమంగా జరిగాయని సంతృప్తి వ్యక్తం చేశారు.మీడియాతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఇలా అన్నారు:అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీయనున్నా యన్నారు.అక్టోబర్ 28న తుఫాను తీరం దాటే అవకాశం ఉంది.269 పునరావాస కేంద్రాలు సిద్ధం చేశారు. అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం జరిగిందన్నారు. ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు.పాకలు, తాటిపాకలు, పూరిల్లు, బలహీన గృహాల్లో నివసిస్తున్నవారు స్వచ్ఛందంగా పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

# వినాయక మోటార్స్ బంపర్ డ్రాలో గెలుపొందిన విజేతలకు బహుమతులు



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబరు 27:** జగ్గంపేట శ్రీ వినాయక మోటార్స్, హీరో షోరూమ్ వారి దసరా మరియు దీపావళి డబుల్ ధమాకా ఆఫర్స్ లో భాగంగా వాహనాల కొనుగోలుపై మెగా బంపర్ డ్రా నిర్వహించారు. ఈసందర్భంగా సోమవారం నిర్వహించిన డ్రాలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. మొదటి బహుమతి రిఫ్రిజేటర్ ను గంపల నాగరాజు, రెండవ బహుమతి కూలర్ ను శివకోటి చిన్న వీర్రాజు, మూడవ బహుమతిగా మూడు స్మార్ట్ వాచీలు, నాల్గవ బహుమతి నాలుగు డిన్నర్ సెట్స్, ఐదవ బహుమతిగా ఇయర్ బడ్స్ ను ముఖ్యఅతిథులు మారిశెట్టి సత్యనారాయణ, వినాయక మోటార్స్ అధినేత వెలమర్తి సూర్యచంద్రరమేష్, నక్కిన దొరబాబు, వెలమర్తి దొరబాబు, జ్యోతుల వీరబాబు అందజేశారు. బహుమతులు అందుకున్న కొనుగోలుదారులు ఆనందం వ్యక్తం చేశారు. వినాయక మోటార్స్ వారు వాహనం కొనుగోలులో క్యాష్ డిస్కౌంట్ తో పాటు ఈవిధంగా లక్కీ డ్రా నిర్వహించి ఆకర్షణీయమైన బహుమతులు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మెకానిక్ శ్రీను, రిటైర్డు ఎస్ఐ సత్యనారాయణ, హీరో షోరూమ్ సిబ్బంది లంక వసంత్, గెద్ద దుర్గాప్రసాద్, సిరిబుల శివ, వెలమర్తి శివప్రసాద్, అయ్యప్ప, మణికంఠ తదితరులు ఉన్నారు.

# మొంథా తుపాన్ దూసుకొస్తోంది

## కోస్తా జిల్లాల్లో అతిభారీ వర్షాలు - గంటకు 110కి.మీ వేగంతో ఈదురుగాలులు

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 27:**నైరుతి మరియు పశ్చిమమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాన్ వేగంగా బలపడుతూ కోస్తాంధ్ర వైపు దూసుకొస్తోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గడిచిన ఆరు గంటల్లో ఇది గంటకు 17 కిలోమీటర్ల వేగంతో కదిలిందని స్క్రోలింగ్ ద్వారా వెల్లడించింది.

తాజా సమాచారం ప్రకారం తుపాన్, చెన్నైకి 440 కి.మీ, విశాఖపట్నంకి 530 కి.మీ కాకినాడకి 490 కి.మీ,దూరంలో కేంద్రీకృతమై ఉంది. పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతున్న మొంథా తుపాన్ రేపు ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.తుపాను తీరం దాటే సమయానికి కోస్తా జిల్లాల్లో అతిభారీ వర్షాలు పడుతున్నాయి. గంటకు 90-110 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులుతీవ్రతరం అవుతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ జాగ్రత్తలు సూచించారు. జాగ్రత్త సూచనలు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు.ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలి.అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి.తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండి పునరావాస ఏర్పాట్లు పూర్తి చేశామని ఎండీ పేర్కొన్నారు.

# తుఫాన్ నేపథ్యంలో ముందస్తు చర్యలు.

**రౌతులపూడి పెన్ పవర్ అక్టోబర్ 27.**ప్రతిపాడు నియోజకవర్గంలో విస్తృత పునరావాస ఏర్పాట్లు. తుఫాన్ ప్రభావం దృష్ట్యా ప్రతిపాడు నియోజకవర్గం వ్యాప్తంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో, సంబంధిత అధికారుల సమన్వయంతో విస్తృత స్థాయిలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వర్షాలు, ఈదురు గాలులు, వరదల ప్రభావం వల్ల ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ,తుఫాన్ తాకిడికి గురయ్యే ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి ఆమె తెలిపారు. రౌతులపూడి మండలంలో 11 పునరావాస కేంద్రాలు, 8 జెసిబీలు, 5 ట్రాక్టర్లు, 8 జనరేటర్లు సిద్ధం చేశారు. ప్రజలకు త్రాగునీరు, నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలు నిరంతరంగా అందించేందుకు అవసరమైన వనరులను సిద్ధంగా ఉంచాం అని తెలిపారు. విద్యుత్ అంతరాయం సంభవించినా గ్రామాల్లో త్రాగునీటి సరఫరా నిలిపిపోకుండా జనరేటర్లు, ట్రాక్టర్లు, జెసిబీలను సిద్ధంగా ఉంచినట్లు ఆమె చెప్పారు. రౌతులపూడి మండల వ్యాప్తంగా గుమ్మరేగుల ఎంపీపీఎస్ , బలరాంపురం జడ్పీపిహెచ్ఎస్, రౌతులపూడి జడ్పీహెచ్ఎస్, లచ్చిరెడ్డిపాలెం జడ్పీహెచ్ఎస్, శృంగవరం ఎంపీపీఎస్, రాజవరం ఎంపీపీఎస్, ఎన్ ఎన్ పట్నం ఎంపీపీఎస్, ఎస్ పైడిపాల ఎంపీయూపీ, పి రామవరం ఎంపీపీఎస్, గిడిజం ఎంపీయు పి, ఏ మల్లవరం ఎంపీయూపీ, ములుగుపూడి జెడ్ పి పి ఎస్, రాఘవపట్నం జిపిపిఎస్, ఎస్ అగ్రహారం జడ్ పిపిఎస్. ప్రజలకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు మరియు సౌకర్యాలను వినియోగించుకోవాలని, అవసరమైతే కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మొంథా తుఫాన్ పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు.

* లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపు.
* అప్పన పాలెం బ్రిడ్జిపై రాకపోకల నిషేధం.





**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 27:**మొంథా తుఫాన్ పట్ల ముందస్తు జాగ్రత్త చర్యలుగా అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏలేరు నది ఒడ్డున ఉన్న యర్రవరం గ్రామంలో లోతట్టు ప్రాంతాలను ఎంపీడీవో పరిశీలించి, పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు సోమవారం చేశారు.తుఫాన్ ముందస్తు చర్యల్లో భాగంగా యర్రవరం గ్రామంలో లోతట్టు ప్రాంత ప్రజలకు హైస్కూల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే లోతట్టు ప్రాంతాలను పరిశీలించామని వారికోసం మండల వ్యాప్తంగా 19 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. యర్రవరం, తదితర గ్రామాలలో ప్రజలకు తుఫాన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ముంతా తుఫాన్ కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని, తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, భారీ నుంచి అతిబరీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని తెలిపారు.తుఫాన్ సమయంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప బయట ప్రాంతాల్లో తిరగవద్దని హెచ్చరించారు.

అలాగే ఏలేరు ప్రధాన కాలువపై గల అప్పన్నపాలెం బ్రిడ్జిని ఎమ్మార్వో కుసరాజు సహచర రెవెన్యూ సిబ్బంది, నగర పంచాయతీ కమిషనర్, పోలీస్ శాఖ సిబ్బందితో పరిశీలించారు.ఇప్పటికే బ్రిడ్జ్ కృంగిపోడంతో దాని పై రాకపోకలు పూర్తిగా నిషేధించారు. బ్రిడ్జిపై హెచ్చరికబోర్డులను ఏర్పాటు చేసి తమ సిబ్బంది పర్యవేక్షణలో నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు.తుఫాన్ ముందస్తు చర్యల పర్యవేక్షణ చేస్తున్న వారిలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ పొన్నాలు, వీఆర్వో లు అవసరాల కిషోర్, సిహెచ్సీ ఆరోగ్య సిబ్బంది, పోలీస్ అధికారులు,నాయకులు బస్సా ప్రసాద్,మైరాల కనకారావు, గంగిరెడ్ల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# కొవ్వూరు నియోజకవర్గంలోని ప్రజలను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే ముప్పిడి





**కొవ్వూరు, పెన్ పవర్, అక్టోబర్ 27:**మొంథా తుఫాన్ జాగ్రత్తలపై క్షేత్ర స్థాయిలో కొవ్వూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను అప్రమత్తం చేసిన కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు. ఈ నేపథ్యంలో కొవ్వూరు మండలంలోని వాడపల్లి, బంగారంపేట, మద్దూరులంక, చిగురులంక, బ్రిడ్జిపేట లను, పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఆయనతో పాటు కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని ఉన్నారు.

ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రాణ నష్టం, అస్తి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని, గ్రౌండ్ జీరోలో ప్రజలను అప్రమత్తం చేస్తోందని అన్నారు. విధులు నిర్వహిస్తున్న అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. తుఫాను ప్రభావంతో ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఎం.దుర్గా ప్రసాద్, అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి.

## మొంథా తుఫాన్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి.

-మాజీ మంత్రి తోట నరసింహం.



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 27:**మొంథా తుఫాను ప్రభావం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం పిలుపునిచ్చారు. రాబోయే
మూడు రోజులు పాటు ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాన్నారు.జగ్గంపేట నియోజకవర్గ ప్రజలకు నేను నా కుమారుడు తోట శ్రీ రాంజీ 24 గంటలు అందుబాటులో ఉంటామన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లల్లో ఉండవద్దని,పశు వులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలాన్నారు.విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, వాటిని తాకవద్దన్నారు.
పాఠశాలలకు సెలవు కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా ఇళ్లల్లోనే ఉంచి రక్షించుకోవాలన్నారు.
వరి కోతలు, కుప్ప నూర్పులు రైతులు వాయిదా వేసుకోవాలన్నారు.
ముఖ్యంగా ఏలేరు పరివాహక ప్రాంత రైతులందరూ కూడా అప్రమత్తంగా ఉండాలి.
మత్స్యకారులు ఎవరూ కుడా వేటకు వెళ్ళవద్దని ప్రతి ఒక్కరికి సేవ చేయడానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంది అని పిలుపును ఇచ్చారు.

## తుఫాన్ నేపథ్యంలో ముందస్తు చర్యలు.




**రౌతులపూడి పెన్ పవర్ అక్టోబర్ 27.**ప్రతిపాడు నియోజకవర్గంలో విస్తృత పునరావాస ఏర్పాట్లు. తుఫాన్ ప్రభావం దృష్ట్యా ప్రతిపాడు నియోజకవర్గం వ్యాప్తంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో, సంబంధిత అధికారుల సమన్వయంతో విస్తృత స్థాయిలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వర్షాలు, ఈదురు గాలులు, వరదల ప్రభావం వల్ల ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ,తుఫాన్ తాకిడికి గురయ్యే ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి ఆమె తెలిపారు. రౌతులపూడి మండలంలో 11 పునరావాస కేంద్రాలు, 8 జెసిబీలు, 5 ట్రాక్టర్లు, 8 జనరేటర్లు సిద్ధం చేశారు. ప్రజలకు త్రాగునీరు, నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలు నిరంతరంగా అందించేందుకు అవసరమైన వనరులను సిద్ధంగా ఉంచాం అని తెలిపారు. విద్యుత్ అంతరాయం సంభవించినా గ్రామాల్లో త్రాగునీటి సరఫరా నిలిపిపోకుండా జనరేటర్లు, ట్రాక్టర్లు, జెసిబీలను సిద్ధంగా ఉంచినట్లు ఆమె చెప్పారు. రౌతులపూడి మండల వ్యాప్తంగా గుమ్మరేగుల ఎంపీపీఎస్ , బలరాంపురం జడ్పీపిహెచ్ఎస్, రౌతులపూడి జడ్పీహెచ్ఎస్, లచ్చిరెడ్డిపాలెం జడ్పీహెచ్ఎస్, శృంగవరం ఎంపీపీఎస్, రాజవరం ఎంపీపీఎస్, ఎన్ ఎన్ పట్నం ఎంపీపీఎస్, ఎస్ పైడిపాల ఎంపీయూపీ, పి రామవరం ఎంపీపీఎస్, గిడిజం ఎంపీయు పి, ఏ మల్లవరం ఎంపీయూపీ, ములుగుపూడి జెడ్ పి పి ఎస్, రాఘవపట్నం జిపిపిపిఎస్, ఎస్ అగ్రహారం జడ్ పిపిఎస్. ప్రజలకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు మరియు సౌకర్యాలను వినియోగించుకోవాలని, అవసరమైతే కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.





జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్.

**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 27:**మొంథా తుఫాను ప్రభావం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ పిలుపునిచ్చారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో కిర్లంపూడి మండలం భూపాలపట్నం, ఎస్ తిమ్మాపురం,ముక్కొల్లు పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు పలు సలహాలు సూచనలు అందజేశారు. రాబోయే మూడు రోజులు పాటు ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాన్నారు.జగ్గంపేట నియోజకవర్గ ప్రజలకు కూటమి ప్రభుత్వం 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు.. శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లల్లో ఉండవద్దని,పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలాన్నారు.విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, వాటిని తాకవద్దన్నారు. పాఠశాలలకు సెలవు కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా ఇళ్లల్లోనే ఉంచి రక్షించుకోవాలన్నారు. వరి కోతలు, కుప్ప నూర్పులు రైతులు వాయిదా వేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఏలేరు పరివాహక ప్రాంత రైతులందరూ కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.ఆయన వెంట ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు,ఎం పి పి, తోట రవి, సీనియర్ టిడిపి నాయకులు ఎస్ వి ఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు,తూము కుమార్, పలువురు టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ తీవ్ర తుఫానుగా మారే అవకాశం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి : చిర్ల జగ్గిరెడ్డి



**కొత్తపేట, పెన్ పవర్,అక్టోబర్ 27:**
బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ వేగంగా తీవ్రతను పెంచుకుంటూ తీవ్ర తుఫానుగా మారుతున్న నేపథ్యంలో, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు.
తుఫాన్ ప్రభావం కారణంగా జిల్లాలో ఈదురుగాలులు, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని ఆయన సూచించారు. ముఖ్యంగా రైతు సోదరులు తమ పొలాల వద్ద ఉన్న విద్యుత్ మీటర్లు, తీగల దగ్గరికి వెళ్లరాదని, విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని జగ్గిరెడ్డి సూచించారు.
తుఫాన్ కారణంగా ఇప్పటికే పాఠశాలలకు సెలవులు ప్రకటించబడినందున, తల్లిదండ్రులు పిల్లలను బయటకు పంపకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. పూరి గుడిసెల్లో లేదా బలహీనమైన ఇళ్లలో నివసించే ప్రజలు ప్రభుత్వం సూచించిన సురక్షిత కేంద్రాలకు తక్షణమే తరలిపోవాలని పిలుపునిచ్చారు.
ప్రజల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నంబర్లను దగ్గర ఉంచుకోవాలని, అవసరమైతే వాటి ద్వారా సహాయం పొందాలని ఆయన సూచించారు.1996లో జిల్లాలో సంభవించిన తుఫాన్ నష్టాలను గుర్తుచేసుకుంటూ, అప్పుడు ఎదురైన పరిస్థితులను పాఠంగా తీసుకుని ఈసారి మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.
"ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించే మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలి. మనందరం కలిసి ఈ తుఫాన్‌ను సురక్షితంగా ఎదుర్కుందాం" అని వైసీపీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి స్పష్టం చేశారు.

## శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి పోటేత్తిన భక్తులు.



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 27:**పవిత్ర కార్తీక మాసం మొదటి సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకొని కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి,శ్రీ అష్టలక్ష్మి అమ్మవారి ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి.గ్రామంలో ప్రసిద్ధిగాంచిన ఈ దేవాలయాల్లో తెల్లవారుజామునుండే విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.వేద పండితులు ఆరాధ్యుల లక్ష్మీనరసింహమూర్తి శర్మ,సోమయాజుల భరత్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## జగన్నాధపురంలో భారీ అన్న సమారాధన





**గోపాలపురం,పెన్ పవర్ అక్టోబర్ 27:**మండలంలోని జగన్నాధపురం గ్రామంలో ఊర చెరువు గట్టుపై ఉన్న శివాలయం వద్ద సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.సుమారు దశాబ్దకాలం కిందట గ్రామస్తులు,భక్తుల సహాయ సహకారాలతో ఈ ఆలయాన్ని నిర్మించి పండుగ వాతావరణం మధ్య ప్రారంభించారు.ఆనాటి నుండి నేటి వరకు ప్రతినిత్యం ఆలయంలోని పూజలు నిర్వహిస్తూనే ఉన్నారు.ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో ఉదయం సాయంత్రం వేళల్లో భక్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపడుతున్నారు.కార్తీకమాస మొదటి సోమవారం కావడంతో భక్తులు గ్రామస్తుల సహాయ సహకారాలతో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.అలాగే సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉన్న ధ్వజ స్తంభానికి ఏర్పాటు చేసిన ఆకాశ దీపాన్ని అమర్చుతున్నారు.ఈ సందర్భంగా అయ్యప్ప మాలదార స్వాములతో పాటు భక్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## మొంథా తుఫాన్ పై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి-తహాశీల్దార్ లావణ్య

**తాళ్ళపూడి, పెన్ పవర్, అక్టోబర్ 27:**మొంథా తుఫాన్ కారణంగా తాళ్ళపూడి తహశీల్దార్ లక్ష్మీ లావణ్య మండలంలోని పలు సచివాలయాలను సందర్శించారు. మండల ప్రజలకు ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను, ప్రక్కిలంక సబ్ స్టేషన్ ను పరిశీలించారు. అదేవిధంగా తుఫాను కారణంగా ఎటువంటి ప్రాణ నష్టం, అస్తి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని ప్రతీ గ్రామంలోని ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.






# మొంథా తుఫాను పట్ల రైతులు పలు జాగ్రత్తలు పాటించాలి.



**–మండల వ్యవసాయ శాఖ అధికారిని నాగం సుధామాధురి.**

**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 25:** ముంచుకొస్తున్న మొంథా తుఫాను పట్ల రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి పిలుపునిచ్చారు. తుఫాను ప్రభావం పట్ల చిల్లంగి, జగపతినగరం గ్రామాల్లో రైతులకు అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోతకు సిద్ధంగా ఉన్న రైతులు తుఫాను కారణంగా వారం రోజుల పాటు కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. వర్షాల కారణంగా ఎక్కడైనా పొలంలో నీరు చెరితే వెంటనే నీటిని కాలువలు ద్వారా బయటకు పంపించాలని సూచించారు. భారీ వర్షాల వలన గాలులు వలన చేను నేలను తాకితే దుబ్బులను పైకి లేపి కట్టలుగా కట్టుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల గ్రామ వ్యవసాయసహాయకులు ఆధ్వర్యంలో రైతులకు తుఫాను ప్రభావం పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

## కోస్తా ప్రజలకు అప్రమత్త హెచ్చరికలు

**కాజులూరు మండలంలో పునరావాస కేంద్రాలు సిద్ధం**

**గ్రామాల్లో టాంటాం చేస్తూ అధికారుల సూచనలు**





**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంథా తుఫాన్ ప్రభావంతో కోస్తా ప్రాంతంలో భారీ గాలివానలు, వర్షాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో కాజులూరు మండలం వ్యాప్తంగా పునరావాస చర్యలు వేగవంతం అయ్యాయి. మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు సిద్ధం చేసినట్లు స్థానిక తహశీల్దార్ జి.ఆర్.ఠాగూర్ తెలిపారు. తుఫాన్ కారణంగా ఇబ్బంది కలిగే పరిస్థితుల్లో ప్రజలు సమీప వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే సిద్ధమై ఉన్నాయన్నారు. ఏ సమయంలోనైనా అత్యవసర సహాయం అందించేందుకు రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పునరావాస కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని తెలిపారు. శలపాక , తణుకువాడ గ్రామంలో సర్పంచ్ పోతుల గనిరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజలకు తుఫాన్ పై జాగ్రత్తలు సూచించారు. ముఖ్యంగా తాటాకు ఇళ్లలో నివసించే వారు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు రావాలని కోరారు. రెండు పాఠశాలల్లో ప్రత్యేక పునరావాస కేంద్రాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అవసరమైతే వైద్య సహాయం, భోజనం వంటి సదుపాయాలు కూడా వెంటనే అందజేస్తామని గ్రామ సర్పంచ్ , కూటమి నాయకులు హామీ ఇచ్చారు. రాత్రి సమయంలో తుఫాన్ తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మండల వ్యాప్తంగా ఎంపీడీవో జె. రాంబాబు, డిప్యూటీ తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, ఆర్ఐ పి.వేగేశ్వరరావు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## మొంథా తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చర్యలు



**అప్రమత్తమైన అధికార యంత్రాంగం.**

**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 27:** ప్రస్తుతం బంగాళాఖాతంలో దూసుకొస్తున్న మొంథా తుఫాన్ నేపథ్యంలో సోమవారం మండలంలోని అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. తాహసిల్దార్ కేజే ప్రకాష్ బాబు, ఎంపీడీవో ఏ.రాజు ఆధ్వర్యంలో స్థానిక అధికార బృందంతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. అకాల తుఫాను కారణంగా మండల ప్రత్యేక అధికారిగా నియమించిన జిల్లా గ్రౌండ్ వాటర్ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మి ప్రత్యూష 18 గ్రామాల్లో ఏర్పాటు చేసిన 22 పునరావాస కేంద్రాలకు పర్యటిస్తూ స్థలం ఏరియాలను క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా మండల కేంద్రమైన ఆలమూరు బొబ్బా జయశ్రీ బాలిక ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని పరిశీలించారు. తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కారణంగా ఆ పునరావస కేంద్రానికి చేరుకున్న సంచార వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే తమ అవసరాలకు అనుగుణంగా పాఠశాల బృందాలు చర్యలు తీసుకోవాలని, మధ్యాహ్న భోజనం పథకం ద్వారా ఉదయం నుండి సాయంత్రం వరకు భోజనం తదితర వసతులు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు అధికారుల సూచనలు తప్పక పాటిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. అనవసర ప్రయాణాలు మానుకోవాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను త్వరితగతిన తొలగించాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ -1 బి అప్పాజీ, ఎంఈఓ 2 ఎన్ రాజు, మాజీ జడ్పిటిసి రామానుజుల శేషగిరిరావు, విద్యా కమిటీ చైర్మన్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాముల బిక్షలో పాల్గొనడం నా అదృష్టం..





* ఆవ భూముల పోరాట యోధుడు అడపా శ్రీనివాస్..
* నల్లమిల్లి వెంకన్న బాబు కు చిరు సత్కారం..

**కోరుకొండ,పెన్ పవర్, అక్టోబర్ 27:** రాయుడుపాకల గ్రామంలో నల్లమిల్లి వెంకన్న బాబు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు బిక్ష కార్యక్రమంలో ఆవ భూముల పోరాట యోధుడు అడపా శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడపా శ్రీనివాస్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామిలు, శివ స్వాములకు మండల కాలం ప్రతిరోజు రెండు వేల మందికి పైగా బిక్ష ఏర్పాటు చేయడం చిన్న విషయం కాదని నల్లమిల్లి వెంకన్న బాబును అభినందించారు. ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం నా అదృష్టం అడపా శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా స్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన నల్లమిల్లి వెంకన్న బాబుకు చిరు సత్కారం చేసి అయ్యప్ప స్వామి భారీ చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో వేలాదిమంది అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోండి



**కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 27:** ప్రస్తుత తుఫాను ప్రభావం నేపథ్యంలో కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం రాజానగరం సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు విద్యుత్ సరఫరా వ్యవస్థలో ఎటువంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆమె విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సబ్‌స్టేషన్‌ల నిర్వహణ సామర్థ్యం, లోడ్ వివరాలు, అధిక వర్షాలు కురిసే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకొని వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తనిఖీ సందర్భంగా సబ్‌స్టేషన్‌లో విధుల్లో ఉన్న క్షేత్రస్థాయి సిబ్బందితో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడి, స్థానిక పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఈపిడిసీఎల్ ఎస్.ఈ కే. తిలక్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా తుమ్మలపల్లి చిట్టిబాబు జన్మదిన వేడుకలు.

* ముఖ్య అతిధిగా హాజరైన తుమ్మలపల్లి రమేష్.



**కిర్లంపూడి, పెన్ పవర్,అక్టోబర్ 27:** కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ చిన్నాన తుమ్మలపల్లి చిట్టిబాబు 75 వ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకి జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. తుమ్మలపల్లి చిట్టిబాబు తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఉండి సర్పంచ్ రాధాకృష్ణ, కత్తిపూడి సొసైటీ చైర్మన్ సురేష్, బదిరెడ్డి నాని,పలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.?

## తుఫాన్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అడ్డతీగల ఎంపీడీవో కుమార్...



**అడ్డతీగల, పెన్ పవర్, అక్టోబర్27:** సోమవారం వేటమామిడి గ్రామ పంచాయతీ పనుకురాతిపాలెం వద్ద పెద్దేరు వాగు ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది, అడ్డతీగల ఎంపీడీవోకుమార్ పెద్దేరు వాగు ప్రాంతాన్ని తమ సిబ్బందితో సందర్శించారు. అదే సమయం లో అక్కడ వాగు దాటుతున్న గ్రామస్తులకు ఆపి వారికి కౌన్సిలింగ్ ఇవ్వటం జరిగింది . అలాగే ఈ యొక్క మూడు రోజులు మంతా తుపాన్ తీవ్ర ప్రభావం చూపనుంది, కనుక గ్రామస్తులు ఎవరు వాగులు వంకలు దాటకుండా ఇంటి వద్దనే ఉండాలని, గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

## పెద్దచెరువు గట్టు పటిష్టతకు చర్యలు-సర్పంచ్ వెంకటలక్ష్మి



**గోపాలపురం,పెన్ పవర్ అక్టోబర్ 27:** మండలంలోని భీమోలు గ్రామ శివారులో ఉన్న పెద్ద చెరువు గట్టి పటిష్టతకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారని గ్రామ సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని అత్యంత పెద్దదైన చెరువు భీమోలు గ్రామంలో ఉందన్నారు. ప్రస్తుతం ఆ చెరువు తాడిపూడి కాలువ ద్వారా వచ్చే గోదావరి జలాలు కురుస్తున్న వర్షాల కారణంగా ఎక్కువ ప్రాంతం నుండి వచ్చే వర్షం నీరుతో పూర్తిగా నిండిపోయిందన్నారు. ప్రస్తుతం తుఫాను కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువ ప్రాంతం నుండి ఎక్కువ మొత్తంలో నీరు చెరువులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. దీంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా చెరువుగట్టు పటిష్టత పరచడానికి రెవెన్యూ అధికారులు శ్రీకారం చుట్టారన్నారు. గట్టు బలహీనంగా ఉన్న ప్రదేశాల్లో ఇసుక బస్తాలు వేయడానికి రంగం సిద్ధం చేశారన్నారు. మండల అధికారులతో పాటు పంచాయతీ సైతం చెరువు విషయంలో అప్రమత్తంగా ఉందన్నారు. ఇదిలా ఉంటే చెరువు దగ్గర స్మశాన వాటిక వద్ద రహదారి మధ్యలో రెండు చోట్ల పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షం కారణంగా వాటిలో నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అయితే సమస్యను గుర్తించిన సర్పంచ్ వెంకటలక్ష్మి గ్రామ కార్యదర్శి షేక్ ఫాతిమా లు స్పందించి ఆ గోతులను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. జెసిబి సహాయంతో ఆ గోతిలో సత్రు పోసి పూడ్చారు. దీంతో వాహనాల రాకపోకలకు మార్గం సుగమం అయ్యింది.

# చినుకు పడితే చిత్తడే...





- రౌతులపూడి ఎస్సీ కాలనీల్లో దశలు దశాబ్దాలుగా అలాగేలిలి
- స్వచ్ఛత-పరిశుభ్రత ఎక్కడ !
- నీ చిరునామా..!
- వర్షం కురిస్తే ప్రజల కన్నీరే ప్రవాహం

**రౌతులపూడి, పెన్ పవర్, అక్టోబర్ 27:** మండల కేంద్రంలో ఉన్న రౌతులపూడి గ్రామం. చుట్టుపక్కల అభివృద్ధి పచ్చని పలకరింపు ఇస్తున్నా, గ్రామానికి ఆనుకుని ఉన్న ఎస్సీ వాడ మాత్రం కాలం కలిసి రాక బాధల మడుగులో నలుగుతోందని కాలనీవాసులు ఆవేదన వెల్లగక్కుతున్నారు.

చినుకు పడితే చాలు..ఇళ్లలో నీరు, నడక అంటే జారి పడిపోతామనే భయం. నాలుగు పదులుగా ప్రజాప్రతినిధులు మారారు, సర్పంచుల పేర్లు మారాయి, పరిపాలనాధికారులు వచ్చి వెళ్లారు. మారని ఒక్కటి ఉంటే అది ఎస్సీ కాలనీల దుస్థితి.

"ఏమున్నదక్కో ఏమున్నదక్కా... ఈ ఊర్లో మాకు ఏమున్నదక్కో" అని ఒక వృద్ధ మహిళ పలికిన మాటలోనే అంతా దాగి ఉంది.

వర్షం కురిస్తే నీటి ప్రవాహం.. జీవితం ముద్దడి

గ్రామం చుట్టు దొరుకుతున్న ప్రవాహాలు నేరుగా ఎస్సీ పేట గృహాల్లోకి చేరి ఇంటి సామాన్లు తడిపేస్తున్నాయి

నేలకూలిన ఇళ్లు పేదలకు గూడు లేని గువ్వల దుస్థితి తెస్తున్నాయి

మురుగు నిల్వతో వ్యాధులు వైఫల్యాలు పెరుగుతున్నాయి

పారిశుధ్యం పేరిట వచ్చిన శుభ్రత ఒక్కరోజైనా కనిపించలేదని మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్రాగునీరు.. వెలుగులు..ఇవి కూడా దరిచేరనివే

పైప్‌లైన్ మట్టిలో పూడ్చి త్రాగునీరు ఆపేస్తారా అనే ప్రశ్నలు

వీధిలైట్లు లేక చీకటి రాజ్యం

విషసర్పాలు సంచరిస్తూ ప్రజలను భయపెడుతున్న పరిస్థితి

ఉండేవి నిధులే.. పనులే కనిపించవు

ఐదు సంవత్సరాలుగా

15వ,ఆర్థిక సంఘ నిధుల వినియోగంపై సందేహాలు

పంచాయతీ 15% ఎస్సీ నిధులు ఎక్కడ? అన్న ప్రశ్న

డ్రైనేజీ వ్యవస్థలో ఒక్క అడుగు ముందడుగు లేదని ఆరోపణలు

వర్షం కురిస్తే ప్రజల కన్నీరే ప్రవాహం

ఈ రెండు రోజుల వర్షాలు పలు ఇళ్లు కూల్చాయి. కానీ

గ్రామంలోనో

మండలంలోనో

ఒక్క ప్రజా ప్రతినిధి కనీసం పర్యవేక్షించలేదని మహిళలు చెబుతున్నారు.

మొంథా తుఫాన్ కళ్లెదుటే...ఆందోళనల్లో ప్రజలు

"ఇంకా వాన పడితే మాకు బ్రతుకే ప్రమాదం"

అని వణుకుతున్న దళిత మహిళల మాటల్లో భయం స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రజల విజ్ఞప్తి

"మా పిల్లలకు కూడా మనుషుల్లా బతుకే హక్కు ఉంది. కనీస అవసరాలు.. కనీస సౌకర్యాలు ఇవ్వండి. అధికారులు స్వయంగా వచ్చి మా సమస్యలు చూడాలి" అని ఎస్సీ కాలనీవాసుల వేడుకోలు.

దళితవాడల దుస్థితి మరలా కొనసాగకూడదంటే, భౌతిక అభివృద్ధి వర్షం కురిసేలా ప్రభుత్వ యంత్రాంగం కదిలి రావాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.









## కొవ్వూరు మండలంలో రెండు పునరావాస కేంద్రాలు-తహశీల్దార్ దుర్గా ప్రసాద్



**కొవ్వూరు, పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా కొవ్వూరు మండలంలోని మాద్దూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో, కొవ్వూరు పీఎంఎంఎం హైస్కూల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తహశీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్ తెలియజేశారు. అదేవిధంగా మండలంలోని ప్రతీ గ్రామంలోని ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఎటువంటి ప్రాణ నష్టం, అస్తి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను, గృహాలు దృడంగా లేని కుటుంబాలను పునరావాస కేంద్రాల్లో ఉంచడం జరిగిందని తెలియజేశారు. ఈ పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికి అన్ని రకాలుగా వసతులు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ తెలిపారు.




## ఏలేరు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

**ఏలేరు ప్రాజెక్టు అవుట్ ఫ్లోస్ 5000 క్యూసెక్కులు విడుదల.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంథా తుఫాన్ ప్రభావంతో రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక లతో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించింది. దీంతో ఏలేరు ప్రాజెక్టు అధికారులు సోమవారం 5000 క్యూసెక్కుల పెంచి జలాలను దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతానికి ఏలేరు జల ప్రాంతాల్లో సరైన వర్షపాతం నమోదు కాలేదు. దీంతో 1700 క్యూసెక్కులు మాత్రమే ఇన్ఫ్లోస్గా వస్తుంది. తుఫాను వల్ల భారీ వర్షాలు కురిస్తే రిజర్వాయర్ కు వచ్చే ముప్పు కంటే, ఏలేరు దిగువున ఉన్న లోతట్టు ప్రాంతాలకు వరద నీటిని అకస్మాత్తుగా వదిలితే భారీగా ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు ఊహించలేనంత ఎక్కువగా ఉంటాయని భావించిన పాలకులు ముందస్తుగానే ఏలేరు జలాలను కొద్దికొద్దిగా పెంచుతూ దిగవకు విడుదల చేస్తున్నారు. అయితే 86.56 మీటర్ల స్థాయిలో టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లో ప్రస్తుతానికి 85.47 మీటర్ల స్థాయిలో 21. 90 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. సోమవారం సాయంకాలం 7 గంటలకు 5,175 క్యూసెక్కుల నీటిని దిగివ ప్రాంతాలకు వదులుతున్నామని లోతట్టు ప్రాంతాలు ఏలేశ్వరం, జగ్గంపేట, కిర్లంపూడి, ప్రతిపాడు, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.



## పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముంబయి పర్యాటక పర్యటన రద్దు



**మొంథా తుఫాన్ నేపథ్యంలో రాజమండ్రికి తిరుగు పయనం**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ ముంబయి పర్యాటక పర్యటన రద్దయింది. ముందుగా నిర్దేశించుకున్న షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 27 నుండి 31 వరకు ముంబయి గోరేగావ్ లోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్ లో భారత ప్రభుత్వ ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ నేతృత్వంలో జరుగనున్న ఇండియా మారిటైమ్ వీక్ బి 2025 సమావేశానికి హాజరయ్యేందుకు మంత్రి కందుల దుర్గేష్ మంబయి బయలుదేరారు. సోమవారం హైదరాబాద్ చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ మొంథా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో తన ప్రయాణాన్ని రద్దు చేసుకొని హైదరాబాద్ నుండి రాజమహేంద్రవరం తిరుగు ప్రయాణమయ్యారు. క్రూయిజ్, ప్యాసింజర్ ఎకానమీ, ప్రపంచ ఉత్తమ పద్ధతులు, పర్యాటక ప్రాంతాలను పర్యాటకుల గమ్యస్థానంగా తీర్చిదిద్దే అంశాలు, పోర్ట్ ఆధారిత పర్యాటకం, డిజిటలైజేషన్, రివర్ క్రూయిజ్, సుస్థిర ప్రయణీకుల ఆర్థికాభివృద్ధి తదితర అంశాలపై జరిగే చర్చలో మంత్రి దుర్గేష్ పాల్గొనాల్సి ఉంది. కానీ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు అండగా నిలిచేందుకు తిరిగి రాజమహేంద్రవరం చేరుకోనున్నారు. ఈ కార్యక్రమానికి నౌకాశ్రయాలు, షిప్పింగ్ , జలమార్గాల మంత్విత్య శాఖ, హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రెవెన్యూ విభాగం, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్, పర్యాటక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు ప్రముఖ గ్లోబల్ క్రూయిజ్ లైన్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ లు హాజరుకానున్నారు.

# చేపల వేటకు వెళ్లొద్దు

గంగవరం ఎస్సై వెంకటేష్






**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 27**
తుఫాన్ నేపథ్యంలో సూరంపాలెం ప్రాజెక్టు లోనికి కొండ వాగులు వద్ద చేపల వేటకు వెళ్లొద్దని గంగవరం ఎస్సై వెంకటేష్ సూచించారు. తుఫాన్ నేపథ్యంలో సోమవారం ఆయన మండలంలోని సూరంపాలెం, దోనేలపల్లి గ్రామాల్లో గల మత్స్యకారుల సొసైటీ సభ్యులతోనూ, నెల్లిపూడి, పంద్ర పొట్టి పాలెం గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. తుఫాను కారణంగా కొండ వాగులు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున ప్రజలు ఎవరు వాగులు దాటువద్దని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు సంభవించినట్లయితే వెంటనే సమాచారం అందించాలని ఆయన సూచించారు. ఆయన వెంట గంగవరం పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# తుఫాన్ పై విద్యుత్ శాఖ సన్నద్ధం



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 27:**ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం మరింత తీవ్ర రూపం దాల్చి పెను తుఫాన్ గా మారనుంది. సోమవారం ఉదయం 9 గంటల నుండి వర్షాలు మొదలయ్యాయి. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైల ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించడంతో ఏపీఈపిడిసిఎల్ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండపేట ఏడిఈ శ్రీధర్ ఆధ్వర్యంలో మండలంలో ఏఈ దుర్గాప్రసాద్, లైన్ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం, సత్యనారాయణ, సిబ్బందితో కలసి ప్రత్యేక ఏర్పాట్లతో సోమవారం సన్నద్ధమయ్యారు. ఈ సందర్భంగా ఏడీఈ శ్రీధర్ మాట్లాడుతూ విద్యుత్ తీగలపై ఉన్న కొమ్మలను ఇప్పటికే తొలగించామన్నారు. విద్యుత్ స్తంభాలతో పాటు క్రేన్లను కూడా అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలకు తుఫాన్ జాగ్రత్తలు చెబుతూ విపరీతమైన గాలులు వీస్తున్నప్పుడు ఎవ్వరూ బయటకు రావొద్దన్నారు. చెట్లు కింద, కరెంటు స్తంభాలు వద్ద ఉండవద్దని, తడి చేతులతో స్విచ్లు వెయ్యవద్దని ఆయన హెచ్చరించారు. ఏ క్షణంలోనైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా సకాలంలో చర్యలు తీసుకుంటామని వారు వెల్లడించారు. మీ మీ గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడితే వెంటనే సమీపంలో గల లైన్ మేన్ లకు సమాచారం అందించాలని ఆయన కోరారు. కొన్ని సమయాల్లో విద్యుత్కు అంతరాయం ఏర్పడవచ్చునని ముందు జాగ్రత్తగా కొవ్వొత్తులు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు. అలాగే నంద్యాల సర్కిల్ బనగంపల్లి రూరల్ సెక్షన్ బేతంచర్ల సబ్ డివిజన్ నుండి సుమారు 27 మంది విద్యుత్ సిబ్బందిని ముందస్తు సహాయక చర్యలకు అందుబాటులో ఉన్నారని తెలియజేశారు.

# మండల ప్రజలుఅప్రమత్తంగా ఉండాలి.

* టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు బొర్రానరేష్,కుమార్



**వి.ఆర్.పురం పెన్.పవర్.అక్టోబర్.27:**రాష్ట్రవ్యాప్తంగాఉరుములు,మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ రెడ్ అలర్ట్,జారీ చేసిందని,గంటకు యాభై నుండి అరవై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని,వాతావరణ శాఖ హెచ్చరించిదని, మండలప్రజలు అప్రమత్తంగా ఉండాలని,టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్,కోరారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఉపముఖ్య మంత్రి పవన్,కల్యాణ్,ఆదేశాలుమేరకు సంబంధిత అధి కారులు ముందస్తుగా తగుచర్యలు చేపట్టారని,టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు బొర్రానరేష్,కుమార్,ప్రకటనలోతెలిపా రు.

# తీర గ్రామాల్లో అప్రమత్త చర్యలు వేగవంతం





* తాళ్లరేవు, పిఠాపురం మండలాల్లో పునరావాస కేంద్రాలు ప్రారంభం
* భోజన వసతి అందుబాటులో

**తాళ్లరేవు/పిఠాపురం, పెన్ పవర్, అక్టోబర్ 27:**మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో తీర గ్రామాల్లో అధికారులు ముందస్తు చర్యలు మరింత బలోపేతం చేశారు. తాళ్లరేవు మండలం పరిధిలోని పటవల, రామన్నపాలెం, రాఘవేంద్రపురం, కొత్తూరులో తాటాకు ఇళ్లు, పాత పెంకుటిల్లులో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పటవల, జి.వేమవరంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఈ సాయంత్రం నుంచే భోజనం ఏర్పాటు చేయడం జరిగినట్లు తెలియజేశారు.అంతే కాకుండా యు.కొత్తపల్లి పునరావాస కేంద్రాన్ని కూడా అధికారుల బృందం సందర్శించి ప్రజలకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించింది. అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా చూసుకుంటున్నామని పేర్కొన్నారు.ఇక పిఠాపురం మండలం పరిధిలో కూడా కోలంక,కంద్రాడ సురక్షిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు సిద్ధం చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ముఖ్యంగా తీరప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం ఉన్నవారు వెంటనే ఏర్పాటు చేసిన కేంద్రాలకు రావాలని సూచించారు.తుఫాన్ తీవ్రత పెరిగే అవకాశం నేపథ్యంలో అధికారులు గ్రామాల్లో టాంటాం చేస్తూ ప్రజలకు విజ్ఞప్తులు చేస్తున్నారు. వైద్య సిబ్బంది, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంచబడ్డారు.





# తుఫాన్ నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలకు సూచనలు.





**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 27:**తుఫాన్ నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలకు అధికార బృందాలు పలు సూచనలు అందించారు.డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కూమార్ ఆదేశానుసారం సోమవారం మండలంలోని బడుగువానిలంకలో ఎంపీడీవో ఏ రాజు, ఎంఈఓ 1 బి అప్పాజీ, ఎంఈఓ 2 ఎన్ రాజు ఆధ్వర్యంలో తుఫాన్ ప్రభావంతో మండల ప్రత్యేక అధికారిగా నియమించిన జిల్లా గ్రౌండ్ వాటర్ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీ ప్రత్యూషతో కలిసి తుఫాన్ ప్రభావం పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం మూడు రోజులు పాటు ఉంటుందని పూరి గుడిసెలు, తాత్కాలిక షెడ్లలో నివసించే వారిని పునరావాస కేంద్రాల్లో తల దాచుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మండల యంత్రాంగం అప్రమత్తంగా ఉందని తెలిపారు. ఇప్పటికే మండల పరిధిలోని 18 గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలలో 22 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి వసతులతో అందుబాటులో ఉంచామన్నారు. అందుకోసం ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు,సిబ్బంది పర్యవేక్షిస్తూ అందుబాటులో ఉంటారన్నారు. పేద ప్రజలను వాటి వద్దకి చేరుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఉదయం నుండి సాయంత్రం వరకు భోజనం తదితర వసతులు ఏర్పాటు చేస్తారన్నారు. విపత్కర పరిస్థితులలో ప్రజలు కూడా అధికారుల సూచనలను తప్పక పాటించాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో సచివాలయం సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్నారన్నారు. అనవసర ప్రయాణాలు మానుకోవాలని తెలిపారు. చెట్లు క్రింద బహిరంగ ప్రదేశాల్లో పశువులను ఉంచొద్దని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న బిల్డింగులు ఇల్లు మూడు రోజులు పాటు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక పందాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎంలు,ఆశ వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది పాలుగోన్నారు.

# బీసీ బాలుర వసతి గృహం పరిశీలన




**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 27:** మండల కేంద్రమైన ఆలమూరులో సమీకృత సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతిగృహాన్ని సోమవారం అధికార బృందం సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తుఫాన్ ప్రభావంతో మండల ప్రత్యేక అధికారిగా నియమించిన జిల్లా గ్రౌండ్ వాటర్ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీ ప్రత్యూష,ఎంపీడీవో ఏ రాజు ఆధ్వర్యంలో బాలుర వసతి గృహంలో రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు వారి భోజనాన్ని రుచి చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు వసతి గృహ నిర్వాహకులతో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండటంతో విద్యార్థులను బయటకు పంపించవద్దని, అలాగే మూడు రోజులకు సరిపడగా నిత్యవసర వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. అవసరమైతే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా విద్యార్థులకు మెరుగైన వైద్యాన్ని అందించాలన్నారు. అనంతరం వసతి గృహంలో మరుగుదొడ్లను పరిశీలించి పరిశు భ్రపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్మెంట్ అడబాల కృష్ణారావు, మాజీ ఎంపీటీసీ రామానుజుల శేషగిరిరావు, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు, వసతి గృహం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆలమూరులో తుఫాన్ పునరావాస కేంద్రం ఏర్పాటు



**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 27:**మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలలో భాగంగా ఆలమూరు బొబ్బా జయశ్రీ బాలిక ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఆలమూరు శివారులో నివసిస్తున్న 15 కుటుంబాలను ఈ పునరవాస కేంద్రానికి తరలించినట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఈదల సత్తిబాబు తెలిపారు. పునరావస కేంద్రం ఎంపీడీవో ఏ రాజు మండల ప్రత్యేక అధికారి లక్ష్మీ ప్రత్యూష పర్యవేక్షణలో వారికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. పునరావస కేంద్రాన్ని సోమవారం సాయంత్రం ఎంపీడీవో ఏ రాజు పంచాయతీ కార్యదర్శి మోక్షంజలి కూటమి నాయకులు ఈదల నల్ల బాబు ఈదల రాంబాబు, మానేపల్లి శ్రీనివాస్ తదితరులు సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com